మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 28 శుక్రవారం 27 - 06 - 2025 పేజీలు: 8 వెల: 4


## గత ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరు లో లక్ష్యాలు బాగా సాధించారని బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ అభినంద



3లో..

- ☐ రాజమండ్రి అంటే గుర్తుకొచ్చేది గోదావరి తీరం
- ☐ పర్యాటక రంగంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ☐ డబుల్ ఇంజిన్ సర్కార్‌తో వేగంగా అభివృద్ధి
- ☐ టూరిజం స్పాట్‌గా హేవలాక్ రైల్వే వంతెన..
- ☐ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



## రూ. 430 కోట్లతో పర్యాటక
# ప్రాజెక్టులు

మన గళం, అమరావతి : పుష్కర ఘాట్ వద్ద అఖండ గోదావరి ప్రాజెక్టుకు గురువారం ఉదయం కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ , ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నిమ్మల రామా నాయుడు కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్థానిక నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. రాజమండ్రి అంటే గుర్తుకొచ్చేది గోదావరి తీరం అన్నారు. అలాగే డొక్కా సీతమ్మ, ఆదికవి నన్నయ్యకు జన్మనిచ్చిన నేల గోదావరి ప్రాంతమని పేర్కొన్నారు. మరోవైపు రూ.430 కోట్లతో ఏపీలో పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలతో పర్యాటక రంగంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా అభివృద్ధి చేస్తున్నాయని ప్రశంసించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్ర మంత్రి షెకావత్ సహకారం అందించారన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు కోసం షెకావత్ సహకారం అందించారని కొనియాడారు. ఏపీలో 974 కిలోమీటర్ల నదీ తీరం ఉందని, విదేశాల్లో నదీ తీరాలను పర్యాటక రంగంగా అభివృద్ధి చేసిన విధంగా అఖండ గోదావరి ప్రాజెక్టును పర్యాటకంగా తీర్చిదిద్దుతామన్నారు. 2035 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఏపీలో పర్యాటక

2 లో..



## అంతరిక్షం నుంచి
# శుభాంశు శుక్లా లైవ్‌కాల్

- అంతరిక్షంలోకి భారత వ్యోమగామి శుభాంశు శుక్లా
- భూకక్ష్య నుంచి లైవ్‌కాల్‌లో మాట్లాడిన శుభాంశు

మన గళం డెస్క్ : భారత కాలమానం ప్రకారం నిన్న మధ్యాహ్నం 12:01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి శుభాంశు శుక్లా సహా మొత్తం నలుగురు వ్యోమగాముల బృందం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయలుదేరిన విషయం తెలిసిందే. ఈ వ్యోమనౌక ఈరోజు సాయంత్రం 4:30 గంటలకు ఐఎస్ఎస్‌తో అనుసంధానం కానుంది. ఈ బృందం అక్కడ 14 రోజుల పాటు ఉండి పలు కీలక పరిశోధనలు చేపట్టనుంది.

2లో..

## రాజ్యాంగమే
# అత్యున్నతమైంది

- రాజ్యాంగం కింద మూడు విభాగాలు పని చేస్తాయి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బీఆర్ గవాయ్



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: దేశంలో తనకు భారత రాజ్యాంగమే అత్యున్నతమైనదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేశారు. రాజ్యాంగం కింద మిగిలిన మూడు విభాగాలు పని చేస్తాయని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి ఆయన స్వస్థలం మహారాష్ట్రలోని అమరావతికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను స్థానికులు

2 లో..



## కాగ్నిజెంట్ సంస్థ ఏర్పాటుకు
# రంగం సిద్ధం

- రాష్ట్ర యువత ప్రతిభావంతులని, సాంకేతికంగా ముందున్నారని చంద్రబాబు వ్యాఖ్య
- స్వర్ణాంధ్ర అభివృద్ధికి కాగ్నిజెంట్ దోహదపడుతుందని ఆశాభావం

మన గళం, అమరావతి : అంతర్జాతీయ టెక్ సంస్థ కాగ్నిజెంట్ భారత్ లో తన కార్యకలాపాలను మరింత విస్తరించే క్రమంలో, ఆంధ్రప్రదేశ్‌లో అడుగు పెడుతోంది. విశాఖపట్నంలోని కాపులుప్పా

2 లో..

## చైనాలో ఎస్సీఓ రక్షణ మంత్రుల భేటీలో
# భారత్ సంచలనం

- ఉగ్రవాదంపై విభేదాలతో ప్రకటనపై భారత్ సంతకానికి నిరాకరణ
- పహల్గామ్ దాడిని ప్రస్తావించిన రక్షణ మంత్రి
- చైనా రక్షణ మంత్రితో రాజ్‌నాథ్ ద్వైపాక్షిక చర్చలు



మన గళం, న్యూఢిల్లీ : అంతర్జాతీయ వేదికపై ఉగ్రవాదం విషయంలో తన దృఢ వైఖరిని, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని భారత్ మరోసారి నిష్కర్షగా చాటుకుంది. చైనాలోని కింగ్‌డావో నగరంలో గురువారం జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) రక్షణ మంత్రుల సమావేశంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉగ్రవాద నిర్మూలన, ప్రాంతీయ భద్రత వంటి అంశాలపై రూపొందించిన ఉమ్మడి ప్రకటనలోని కొన్ని ప్రతిపాదనలు భారత ప్రయోజనాలకు, వైఖరికి విరుద్ధంగా ఉండటంతో, దానిపై సంతకం చేయడానికి భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. ఆ ప్రతిపాదనల పత్రాలను పరిశీలిస్తూ పెన్ను పక్కనపెట్టేశారు. ఈ నిర్ణయం, ఉగ్రవాదంపై, ప్రత్యేకించి సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ ఎంతటి కఠిన వైఖరిని అవలంబిస్తుందో ప్రపంచానికి స్పష్టం చేసింది. సమావేశానంతరం విడుదల చేయాలని

2 లో..



## ఉత్తరాఖండ్‌లో ఘోర బస్సు
# ప్రమాదం

- బద్రీనాథ్ వెళ్తుండగా నదిలో పడిపోయిన బస్సు
- 11 మంది గల్లంతు

2లో..

మన గళం డెస్క్ : ఉత్తరాఖండ్ రుద్రప్రయాగ్‌లోని రిషికేశ్ బద్రీనాథ్ జాతీయ రహదారి సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అలకనంద నదిలో పడిపోయింది. బస్సులో 19 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ సంఘటన

# కొత్త హాల్‌టికెట్లు విడుదల

## మెగా డీఎస్సీ పరీక్షల కేంద్రాలు, తేదీలు మారాయ్..



మన గళం, అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా మెగా డీఎస్సీ ఆన్‌లైన్ రాత పరీక్షలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షలు జూన్ 6వ తేదీ నుంచి మొత్తం 154 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్నాయి. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 30వ తేదీ నాటికి ఈ పరీక్షలు పూర్తి కావల్సి ఉంది. అయితే జూన్ 20,21 తేదీల్లో నిర్వహించవల్సిన పరీక్షలను అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ పరీక్షలను జులై 1, 2వ తేదీల్లో నిర్వహిచనున్నట్లు విద్యాశాఖ అప్పట్లో తెలిపింది. దీంతో మారిన ఈ రెండు రోజుల డీఎస్సీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను తాజాగా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో జూన్ 20, 21 తేదీల్లో జరగాల్సిన

2 లో..

## రేషన్ డిపోల వద్ద
# క్యూఆర్ కోడ్ ఏర్పాటు

- స్కాన్ చేసి సరుకులు, డీలర్లపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వొచ్చు
- ఈనెల 26 నుంచే జులై నెల సరుకుల పంపిణీ ప్రారంభం
- నూతన విధానాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల మనోహర్



మన గళం, అమరావతి : రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో పలు కీలక సంస్కరణలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా వినియోగదారుల అభిప్రా

2లో..

## కూటమి ప్రభుత్వానికి
# ఆర్థిక క్రమశిక్షణ లోపించింది

- ఏపీ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణపై జగన్ ధ్వజం
- రాజ్యాంగ ఉల్లంఘనలంటూ ఆరోపణ

2 లో..



# అంతరిక్షం నుంచి శుభాంశు శుక్లా లైవ్‌కాల్

దాదాపు 41 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఒక భారతీయుడు అంతరిక్షంలోకి అడుగుపెట్టడం ఇదే తొలిసారి. అంతరిక్షం నుంచి లైవ్‌కాల్‌లో శుభాంశు శుక్లా మాట్లాడుతూ... “అంతరిక్షం నుంచి అందరికీ నా నమస్కారాలు. తోటి వ్యోమగాములతో కలిసి ఇక్కడ ఉండటం ఎంతో ఆనందంగా ఉంది. ఇది ఒక గొప్ప ప్రయాణం. 30 రోజుల క్వారంటైన్ అనంతరం ఇప్పుడు ఐఎస్ఎస్‌కు చేరుకోబోతున్నాం. ఈ ప్రయాణంలో నాకు అన్ని విధాలా సహకరించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు” అని పేర్కొన్నారు. తమతో పాటు ‘జాయ్’ అనే ఒక బేబీ హంస బొమ్మను కూడా తీసుకెళ్తున్నామని, భారతీయ సంప్రదాయంలో హంస విజ్ఞానానికి ప్రతీక అని ఆయన వివరించారు. దాదాపు 15 నిమిషాల పాటు సాగిన ఈ లైవ్‌కాల్‌లో శుభాంశు తన అనుభూతులను వివరిస్తూ... “భారరహిత స్థితికి ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నాను. అంతరిక్షంలో ఎలా నడవాలి? ఎలా ఆహారం తీసుకోవాలి? వంటి విషయాలను ఒక చిన్నపిల్లాడిలా నేర్చుకుంటున్నాను. ఇక్కడ గడిపే ప్రతీ క్షణాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నాను. నా భుజంపై మన మువ్వన్నెల పతాకం ఉంది. అది చూసినప్పుడల్లా ఈ ప్రయాణంలో నేను ఒంటరిని కానని, కోట్లాది మంది భారతీయులు నాకు తోడుగా ఉన్నారనే ధైర్యం కలుగుతుంది. రోదసీయానంలో నాది ఒక చిన్న అడుగే కావచ్చు, కానీ భారత మానవ సహిత అంతరిక్ష యాత్రలకు ఇది ఒక ఘనమైన ముందడుగు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వీలైనంత ఎక్కువ సమయం గడపాలని, నా అనుభవాలను మీ అందరితో పంచుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను” అని శుభాంశు శుక్లా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# రాజ్యాంగమే అత్యున్నతమైంది



ఘనంగా సత్కరించారు. అనంతరం జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ.. కొంత మంది పార్లమెంట్ అత్యున్నతమైనదని చెబుతారని.. ఆ తర్వాతే రాజ్యాంగమని పేర్కొంటారన్నారు. కానీ తనకు మాత్రం రాజ్యాంగమే అత్యున్నతమైనదని చెప్పారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కింద శాసన, న్యాయ, కార్యనిర్వాహక వర్గాలు పని చేస్తాయని వివరించారు. వీటిపై నిత్యం చర్చ జరుగుతునే ఉంటుదన్నారు. అయితే పార్లమెంటుకు సవరించే అధికారం ఉందని.. కానీ అది రాజ్యాంగం యొక్క ప్రాథమిక నిర్మాణాన్ని మాత్రం మార్చలేమని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలతోపాటు సూత్రాలకు సంరక్షకుడిననే విషయాన్ని న్యాయమూర్తి నిత్యం గుర్తుంచుకోవాలని తెలిపారు. మనకు అధికారం మాత్రమే కాకుండా మనపై బాధ్యత సైతం ఉందన్నారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి సంఘటనలను జస్టిస్ బీఆర్ గవాయ్ గుర్తు చేసుకున్నారు. చిన్నతనంలో తాను ఆర్కిటెక్ట్ కావాలనుకున్నానన్నారు. కానీ తన తండ్రి మాత్రం న్యాయవాది కావాలని.. అందుకోసం న్యాయ శాస్త్రం అభ్యసించాలని సూచించారని చెప్పారు. తన తండ్రి న్యాయవాది కావాలని అనుకున్నారని.. కానీ స్వతంత్ర పోరాటంలో పాల్గొని ఆయన జైలుకు వెళ్లడంతో.. తన తండ్రి కల నెరవేరలేదని ఈ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్ వివరించారు.

# ఉత్తరాఖండ్‌లో ఘోర బస్సు ప్రమాదం

పార్ఘోలీర్ సమీపంలో జరిగింది.. అక్కడ ఒక మినీ బస్సు ట్రక్కును ఢీకొట్టింది.. ఈ క్రమంలో బస్సు అదుపు తప్పి నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మరణించాడు. చాలా మంది ప్రయాణికులు నీటిలో గల్లంతయ్యారని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే, పోలీసులు, పరిపాలన బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. వెంటనే సహాయక చర్యలను ప్రారంభించాయి. రుద్రప్రయాగ్ జిల్లాలోని ఘోలాతిర్ ప్రాంతంలో ఒక బస్సు అదుపు తప్పి అలకనంద నదిలో పడిపోయిందని పోలీసు ప్రధాన కార్యాలయ ప్రతినిధి ఐజి నీలేష్ ఆనంద్ భరానే తెలిపారు. సమాచారం ప్రకారం.. బస్సులో 19 మంది ప్రయాణిస్తున్నట్లు చెబుతున్నారు. వారిలో ఏడుగురిని రక్షించారు. 11 మంది గల్లంతైనట్లు అధికారులు చెబుతున్నారు. ఒకరు మరణించారు. రెస్క్యూ టీం కొంతమందిని రక్షించి చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.. అక్కడ వారు చికిత్స పొందుతున్నారు. వారిలో చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయి. కేదార్‌నాథ్ నుండి ప్రయాణించిన తర్వాత, ఈ ప్రయాణికులు రాత్రి రుద్రప్రయాగలో ఉండి గురువారం అంటే ఈరోజు ఉదయం బద్రీనాథ్‌కు బయలుదేరాలని ప్లాన్ చేసుకున్నారని చెబుతున్నారు. కానీ గోచార్ సమీపంలో, బస్సు అకస్మాత్తుగా ట్రక్కును ఢీకొట్టడంతో నదిలో పడిపోయింది.

# భారత్ సంచలనం

భావించిన ఉమ్మడి ప్రకటన ముసాయిదాలో, ఇటీవలే జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో, పాకిస్థాన్ పదేపదే ఆరోపిస్తున్న బలూచిస్థాన్‌లోని మిలిటెంట్ కార్యకలాపాల గురించి పరోక్షంగా ప్రస్తావించే ప్రయత్నాలు జరిగాయని, దీనిని భారత్ తీవ్రంగా వ్యతిరేకించిందని సమాచారం. ఉగ్రవాద అంశంపై సభ్య దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో, చివరికి ఎస్ సీఓ ఎలాంటి ఉమ్మడి ప్రకటనను జారీ చేయకుండానే సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో చైనా, రష్యా, పాకిస్థాన్‌తో పాటు ఎస్సీఓలోని పది సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని తమ ప్రభుత్వ విధానంలో భాగంగా మార్చుకుని, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ, వారికి శిక్షణనిస్తున్నాయని పరోక్షంగా పాకిస్థాన్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ, ఇది పాకిస్థాన్ ప్రేరేపిత లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ దుశ్చర్యేనని ఆయన స్పష్టం చేశారు.

# కూటమి ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లోపించింది

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను గాలికొదిలేసి, రాజ్యాంగ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, నిధుల సమీకరణ పద్ధతులపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. 2025 జూన్ 25న ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) రెండో విడత నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీలు లేదా బాండ్లు) జారీని పూర్తి చేసిందని, 9.30 శాతం అధిక వడ్డీ (కూపన్) రేటుకు రూ. 5,526 కోట్లు సమీకరించిందని జగన్ తెలిపారు. దీంతో మొత్తం బాండ్ల విలువ రూ. 9,000 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏపీ హైకోర్టులో కేసు విచారణలో ఉందని, నోటీసులు కూడా జారీ అయ్యాయని గుర్తుచేశారు. ఈ బాండ్ల ద్వారా సమీకరించిన నిధులను ప్రభుత్వ రెవెన్యూ వ్యయాల కోసం వినియోగిస్తున్నారని స్పష్టమవుతోందని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ నిబంధనలను పూర్తిగా విస్మరించి, అపూర్వమైన రీతిలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రైవేటు పార్టీలకు రాష్ట్ర సంఘటిత నిధిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించిందని జగన్ దుయ్యబట్టారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్వారా డైరెక్ట్ డెబిట్ ఆదేశాలు జారీ చేసి, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల ప్రమేయం లేకుండానే ప్రైవేటు వ్యక్తులు రాష్ట్ర ఖజానా నుంచి నిధులు విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించారని తెలిపారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204, 293(1) లను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఆయన అన్నారు. ఎన్‌సీడీ బాండ్లకు అదనపు హామీగా, గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,91,000 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి అయిన ఖనిజ సంపదను కేవలం రూ. 9,000 కోట్ల బాండ్ల కోసం తాకట్టు పెట్టిందని జగన్ విమర్శించారు. రాష్ట్ర సంఘటిత నిధికి ఇలా ప్రైవేటు వ్యక్తులకు అనుమతి ఇవ్వడం, ఇంత భారీ మొత్తంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం చూస్తుంటే, ఈ బాండ్లు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే రాష్ట్ర అభివృద్ధి రుణాల (ఎస్‌డీఎల్) కంటే ఎక్కువ సురక్షితమైనవిగా భావించాలా? అని వ్యాఖ్యానించారు.



అయినప్పటికీ, ఏపీఎండీసీ బాండ్లను 9.30 శాతం అధిక వడ్డీ రేటుకు జారీ చేశారని, ఇది ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధి రుణాలపై ఉన్న వడ్డీ రేటు కంటే 2.60 శాతం ఎక్కువని జగన్ తెలిపారు. ఈ అధిక వడ్డీ రేటు కారణంగా ఏపీఎండీసీపై ఏటా అదనంగా రూ. 235 కోట్ల భారం పడుతుందని, ఈ బాండ్ల కాలపరిమితి పదేళ్లుగా ఉందని తెలిసిందని అన్నారు. ఈ అదనపు భారం వల్ల లబ్ధి పొందింది ఎవరో ముఖ్యమంత్రి చంద్రబాబు సమాధానం చెప్పాలని జగన్ డిమాండ్ చేశారు.

# రూ.430 కోట్లతో పర్యాటక ప్రాజెక్టులు

మొదటి పేజీ తరువాయి

రంగాన్ని అభివృద్ధి చేస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

**- టూరిజం స్పాట్‌గా హేవలాక్ రైల్వే వంతెన..**

రాజమండ్రి వద్ద గోదావరిపై 127 సంవత్సరాల చరిత్ర ఉన్న హేవలాక్ రైల్వే వంతెనను టూరిజం స్పాట్‌గా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. రాజమండ్రి రూరల్ బొమ్మూరులో రూ.15 కోట్లతో నిర్మాణం చేపట్టిన సైన్స్ మ్యూజియాన్ని కేంద్ర మంత్రి షెకావత్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభోత్సవం చేయనున్నారు. అలాగే దివాన్ చెరువు వద్ద రూ.30 కోట్ల వ్యయంతో ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ అకాడమీకి శంకుస్థాపన చేయనున్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపనకు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వస్తున్న సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ రహితంగా నిర్వహిస్తున్నామని, తాగునీటికి ప్లాస్టిక్ వాడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పుష్కర్‌ఘాట్ వద్ద గజ ఈతగాళ్లు, రెస్క్యూ బోట్లను అందుబాటులో ఉంచామన్నారు.



# కాగ్నిజెంట్ సంస్థ ఏర్పాటుకు రంగం సిద్ధం

డలో అత్యాధునిక సదుపాయాలతో కూడిన క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కాగ్నిజెంట్ సంస్థకు సాదర స్వాగతం పలికారు. ఈ పరిణామం రాష్ట్ర అభివృద్ధికి, ముఖ్యంగా యువత ఉపాధి అవకాశాలకు ఎంతగానో దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ యువత అపారమైన ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాలతో ప్రపంచాన్ని శాసించడానికి సిద్ధంగా ఉన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కాగ్నిజెంట్ రాకతో ఇటు సంస్థకు, అటు రాష్ట్రానికి పరస్పర వృద్ధికి అవకాశం లభిస్తుందని తెలిపారు. విశాఖపట్నంలోని కాపులుప్పాడలో నిర్మించనున్న ఈ అత్యాధునిక క్యాంపస్... టెక్ ఆవిష్కరణలు, ప్రతిభ, ప్రపంచస్థాయి భాగస్వామ్యాల ద్వారా స్వర్ణాంధ్ర నిర్మాణానికి గణనీయంగా దోహదపడుతుందని చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర యువత నైపుణ్యాలకు కాగ్నిజెంట్ ఒక మంచి వేదిక అవుతుందని, తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా, ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానం రాష్ట్రానికి అందుబాటులోకి వస్తుందని ఆయన వివరించారు. కాగ్నిజెంట్ సంస్థను విశాఖపట్నానికి స్వాగతిస్తూ, వారికి అన్ని విధాలా శుభం కలగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ పెట్టుబడి రాష్ట్ర పారిశ్రామిక, సాంకేతిక రంగాల అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని, ఆంధ్రప్రదేశ్‌ను ఒక కీలకమైన టెక్నాలజీ హబ్‌గా మార్చడంలో సహాయపడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగ్నిజెంట్ సంస్థను విశాఖపట్నానికి స్వాగతిస్తూ, వారికి అన్ని విధాలా శుభం కలగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. కాగ్నిజెంట్ రాకతో విశాఖ నగరం ఐటీ రంగంలో మరింత కీలక ప్రాంతంగా మారుతుందని భావిస్తున్నారు.

# కొత్త హాల్‌టికెట్లు విడుదల

మొదటి పేజీ తరువాయి


పరీక్షల తేదీలతోపాటు, పరీక్ష కేంద్రాలలోనూ మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ రెండు తేదీల్లో పరీక్షలు ఉన్న విద్యార్థులు మారిన కొత్త హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు సూచించింది. ఈ మేరకు పరీక్షా కేంద్రాలు, పరీక్ష తేదీలు మార్చిన హాల్ టికెట్లు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. కాగా 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నియామక ప్రక్రియ చేపట్టారు. రోజుకు రెండు షిఫ్టుల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మెగా డీఎస్సీకి 3,35,401 మంది 5,77,417 దరఖాస్తులు సమర్పించారు. ఇప్పటికే కొన్ని పరీక్షల ప్రాథమిక ఆన్సర్ కీలు వచ్చేశాయి. మొత్తం పరీక్షలు పూర్తయిన తర్వాత మరుసటి రోజున ప్రాథమిక ‘కీ’ విడుదల చేయనున్నారు. అభ్యంతరాల స్వీకరణకు వారం గడువు ఇచ్చి.. అనంతరం తుది ఆన్సర్ కీ విడుదల చేస్తారు.

# రేషన్ డిపోల వద్ద క్యూఆర్ కోడ్ ఏర్పాటు

యాలు, ఫిర్యాదులను నేరుగా స్వీకరించేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్ డిపోల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు.

రేషన్ కార్డుదారులు తమ స్మార్ట్‌ఫోన్లతో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఒక వెబ్ ఫారమ్‌లోకి ప్రవేశిస్తారని మంత్రి నాదెండ్ల వివరించారు. ఈ ఫారమ్‌లో ఆ నెల రేషన్ సరుకులు అందుకున్నారా? లేదా? సరుకుల నాణ్యత ఎలా ఉంది? తూకంలో ఏమైనా తేడాలున్నాయా? రేషన్ డీలర్ ప్రవర్తన, ఏవైనా అధిక ధరలు వసూలు చేశారా? వంటి ప్రశ్నలకు “అవును” లేదా “కాదు” అనే సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులు నమోదు చేసే ఈ వివరాలు, అభిప్రాయాలు నేరుగా ఉన్నతాధికారులకు చేరుతాయని, దీనివల్ల సమస్యలున్న చోట తక్షణమే చర్యలు తీసుకునేందుకు వీలు కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యం ద్వారానే పౌర సేవలను మరింత మెరుగుపరచాలన్నది మా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. వీరికి ఐదు రోజుల ముందుగానే రేషన్ అందజేయనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా జులై నెలకు సంబంధించిన రేషన్ సరుకుల పంపిణీని కూడా నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు ఆయన వివరించారు.

గతంలో ఇంటింటికీ రేషన్ పేరిట మొబైల్ యూనిట్ల ద్వారా జరిగిన పంపిణీ విధానంతో పోలిస్తే, ప్రస్తుతం రేషన్ డిపోల ద్వారా జరుగుతున్న పంపిణీ వ్యవస్థ మెరుగైన ఫలితాలను ఇస్తోందని మంత్రి అభిప్రాయపడ్డారు. “ప్రజల అభిప్రాయాలే మాకు మార్గదర్శకం. ఈ నూతన వ్యవస్థలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, సేవలను మరింత మెరుగుపరిచేందుకు సహకరించాలి” అని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ విధానాల ద్వారా పంపిణీ వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుందని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# కార్మికులను బానిసలుగా మార్చే కార్మిక కోడ్లను రద్దు చేయాలి

**–,జులై 9 న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి**

**– సిఐటియు ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు**




మన గళం,కర్నూలు పాతబస్తీ : సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ అన్ని యూనియన్ ల ఆఫీస్ బేరర్ సమావేశం సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన సుర్జీత్ భవన్లో జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల మధ్య భావోద్వేగాలలో కులాల మధ్య మతాల మధ్య భేదాభిప్రాయాలను సృష్టిస్తూ దేశ ఐక్యతను దెబ్బతీస్తున్నారని తెలిపారు, దేశంలో అవినీతి పెరిగిపోయిందని గత కాంగ్రెస్ ప్రభుత్వము అవినీతి అక్రమాలకు పాల్పడుతూ నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తూ దేశ ఐక్యతను విచ్చిన్నం చేస్తుందని 2014 ఎన్నికల ముందు కార్పొరేట్లతో కలిసి విస్తారంగా ప్రచారం చేసిన బిజెపి అధికారంలోనికి వచ్చిన తర్వాత ఎవరు చేయలేనంత అవినీతి అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను దేశం కోసం ధర్మం కోసం అని భక్తి పేరట భావోద్వేగాలకు గురిచేస్తూ పెద్ద నోట్ల రద్దు,,జీఎస్టీ,,ఒకే దేశం,ఒకే భాష,ఒకే సంస్కృతి ని మొదలుపెట్టి,దేశ సంపదను అంబానీ,అదానిలకు అప్పనంగా అప్పజెపుతుందని విమర్శించారు, కార్పొరేట్లకు ప్రభుత్వ సంస్థలను అప్పజెపడమే కాకుండా ప్రజలపై అనేక రకాల భారాలు వేస్తూ ప్రజలను అప్పులపాలు చేస్తూ మానసిక ధైర్యాన్ని దెబ్బతీస్తుందని తెలిపారు, బ్రిటిష్ వాడి కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను పెట్టుబడి దారులకు కార్పొరేట్లకు దోచుకోవడానికి అడ్డంగా ఉన్నాయని రోజు రోజుకు కార్మిక చట్టాలను తూట్లు పొడుస్తూ కార్మిక కోడ్లను కార్మికులకు తెలియకుండానే అమలు చేస్తున్నారని గుర్తు చేశారు.ఈ బీజేపీ ప్రభుత్వం రవాణా రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ఓలా, ఉబర్ లాంటి కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహిస్తూ మోటార్ వర్కర్ కార్మికులకు ఉరితాడు లాంటి రోడ్డు భద్రత చట్టాలను తెచ్చి వారి కడుపు కొడుతున్నారని విమర్శించారు, భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తూ వారికి నష్టపరిహారం ఇవ్వకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు, అంగడి వాడి ఆశ వర్కర్స్, హెల్త్ వర్కర్లకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వకుండా పని ఒత్తిడి పెంచి ఉద్యోగాలు వెళ్లి పారిపోయే విధంగా ఒత్తిడి చేస్తున్నారని గుర్తు చేశారు, హమాలి కార్మికులు అసంఘటిత కార్మికులు అనేక సంవత్సరాల నుండి సంక్షేమ బోర్డు కోసం పోరాటం చేస్తున్న పట్టించుకోకపోగా వారిపైనే నిర్బంధాలను విధిస్తూ పని హక్కు లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నందున ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగానే జులై 9న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు పిలుపునిచ్చిందని తెలిపారు, ఈ కార్యక్రమంలో సిఐటియు నగర్ ఆఫీస్ బేరర్స్ నాగస్వాములు,మైమూద్,ఖాజా పాషా, రామకృష్ణ, సోలమన్ రాజు, రాంబాబు, కుమార్, మాసుం, మద్దిలేటి, షేక్ష,చిన్న చెన్నుడు అయ్యన్న,నాగరాజు, విశ్వాసం, బజారి, మరియు కార్మికులు పాల్గొన్నారు.

# గత ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరు లో లక్ష్యాలు బాగా సాధించారని బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ అభినంద

**– ఈ ఏడాది కూడా మరింత ఎక్కువగా రుణాలు చేసి బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలి**

**– రుణాల మంజూరు ద్వారా ఎంఎస్ఎంఈ, రెన్యువబుల్ ఎనర్జీ రంగాల అభివృద్ధికి తోడ్పడాలి**

**– కౌలు రైతులకు రుణాలు మంజూరు లో మరింత చొరవ చూపించాలి**

**– అవసరంలో ఉన్న పేదల కోసం బ్యాంకర్లు సిఎస్ఆర్ ఫండ్ ను ఏర్పాటు చేయాలి**

**– జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**



మన గళం,కర్నూలు, కలెక్టరేట్ : గత ఆర్థిక సంవత్సరంలో రుణాల మంజూరు లో లక్ష్యాలు బాగా సాధించారని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా బ్యాంకర్లను అభినందించారు..అదే విధంగా ఈ ఏడాది కూడా మరింత ఎక్కువగా రుణాలు చేసి బ్యాంకింగ్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని కలెక్టర్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో బ్యాంకర్ లకు సంబంధించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో దాదాపు అన్ని ప్రాధాన్యతా రంగాల్లో బ్యాంకర్లు కేటాయించిన లక్ష్యాలను సాధించారని అభినందించారు.. ఎమ్ఎస్ఎంఈ, హౌసింగ్, విద్య, స్టాండ్ అప్ ఇండియా లోన్లు ఇవ్వడంలో మాత్రం బ్యాంక్ లు వెనుకబడి ఉన్నాయని, ఈ ఏడాది ఈ రంగాలకు కూడా విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు..విజన్ ప్లాన్ లో భాగంగా రానున్న కాలంలో కర్నూలు జిల్లా పునరుత్పాదక శక్తికి(రెన్యువబుల్ ఎనర్జీ) కేంద్రంగా మారనుందన్నారు. ఓర్వకల్లు లో 1000 మెగా వాట్ కి సంబంధించిన సోలార్ ప్రాజెక్ట్ తో పాటు గ్రీన్ కో ద్వారా 1680 మెగా వాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ను ఏర్పాటు చేశారన్నారు..వీటితో పాటు ఆలూరు, ఆస్పరి, పత్తికొండ ప్రాంతాల్లో పలు సోలార్, విండ్ ప్రాజెక్టులు ఏర్పాటు అవుతున్నాయన్నారు. అందువల్ల ఈ రంగంలో రుణాల మంజూరుపై శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లాలో పిఎం సూర్యఘర్ కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు రుణాలు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్టాండ్ అప్ ఇండియా, పిఎం విశ్వకర్మ యోజన రుణాల మంజూరులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు రుణాల మంజూరు పై బ్యాంకర్లు వారంలో ఒక రోజును కేటాయించి, సమీక్షించుకోవాలన్నారు.. సిసిఆర్సి కార్డు దారులకు రుణాలు ఇవ్వడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. రాయలసీమ పేద రైతులే కౌలు రైతులుగా ఉంటారని, రుణాలు మంజూరు చేసి వారిని ఆదుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఎల్బీసీ గైడ్లైన్స్ ప్రకారం డ్రోన్ ల మంజూరుకు సంబంధించి కూడా రుణాల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు..మత్స్య శాఖ అభివృద్ధి జీవీఏలో కీలకంగా ఉందని, ఇందుకు సంబంధించి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ లో ఎక్కువ దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అదే విధంగా ముద్ర లోన్ ల దరఖాస్తు లు కూడా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ లో ఎక్కువ పెండింగ్ లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించి రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ అధికారిని ఆదేశించారు....విద్యా రుణాల మంజూరు లో బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ శిక్షణ కేంద్రం ద్వారా స్వయం ఉపాధి కార్యక్రమాల్లో భాగంగా శిక్షణతో పాటు ఉపాధి కల్పన కు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.. కలెక్టర్ గారి ఆదేశాల మేరకు 35 మందికి 4 వీలర్ డ్రైవింగ్ లో శిక్షణ ఇవ్వడం జరిగిందని, వీరికి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సిఎస్ఆర్ ఫండ్ ఏర్పాటు చేయండి : అవసరంలో ఉన్న పేదల కోసం జిల్లాలో ఉన్న అన్ని బ్యాంకులు కలిసి కొంత మొత్తంతో సిఎస్ఆర్ ఫండ్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని బ్యాంకుల నుండి సిఎస్ఆర్ కింద కొంత మొత్తం జమ చేసి, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో ఫిక్స్ డ్ డిపాజిట్ ఏర్పాటు చేసి, ఆ మొత్తం మీద వచ్చే వడ్డీతో నిజంగా డబ్బు అవసరం ఉన్నటువంటి రైతులకు, పేద ప్రజలకు సాయం చేయడానికి అవకాశం ఉంటుందని, వచ్చే సమావేశం నాటికి ఈ దిశగా చర్యలు ఉండాలని కలెక్టర్ ఎల్డిఎం ను ఆదేశించారు. 2025–26 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.17402.86 కోట్లు : 2025–26 వార్షిక రుణ ప్రణాళిక ను కలెక్టర్ ఆవిష్కరించారు.. ఈ ఏడాది లక్ష్యం రూ.17402.86 కోట్లు అని, ఇది గత సంవత్సరం లి2024–25)తో పోల్చుకుంటే 15.49 శాతం ఎక్కువగా ఉందని కలెక్టర్ తెలిపారు .ఈ సంవత్సరానికి నిర్దేశించిన ముఖ్యమైన రంగాల వారీగా రుణ లక్ష్యాలను కలెక్టర్ వివరిస్తూ, మొత్తం వ్యవసాయ రుణాలు రూ.6162.06 కోట్లు కాగా, అందులో ఖరీఫ్ వ్యవసాయ రుణాలు రూ.3635.62 కోట్లు, రబీ వ్యవసాయ రుణాలు: రూ.2526.44 కోట్లు అన్నారు .. వ్యవసాయ కాలరుణాలు: రూ.2202.54 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాలు: రూ. 39.24 కోట్లు, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు: రూ. 560.38 కోట్లు, మొత్తం వ్యవసాయ రంగానికి రుణ లక్ష్యం రూ. 8964.22 కోట్లు అని ఇది మొత్తం రుణ లక్ష్యంలో 51.51% గా ఉందన్నారు.. ఇతర రంగాల కేటాయింపుల్లో భాగంగా మైక్రో, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు రూ.3570.63 కోట్లు, ఇది 20.52% గా ఉందన్నారు.. విద్య రుణాలు: రూ.80.26 కోట్లు, ఇది 0.46% గా ఉందన్నారు.. హౌసింగ్ రుణాలు: రూ.200.81 కోట్లు, ఇది 1.15% గా ఉందన్నారు.. సామాజిక మౌలిక సదుపాయాలు: రూ. 3.16 కోట్లు, ఇది 0.02% గా ఉందన్నారు.. పునరుత్పాదక శక్తి: రూ.94.33 కోట్లు, ఇది 0.54% గా ఉందన్నారు.. ఇతర రంగాలు: రూ.688.31 కోట్లు, ఇది 3.96% గా ఉందన్నారు.. మొత్తం ప్రాధాన్యత రంగాల రుణాల లక్ష్యం: రూ. 13601.72 కోట్లు, ఇది మొత్తం రుణ లక్ష్యంలో 78.17% గా ఉంది. ప్రా ధాన్యత లేని రంగాల రుణాల లక్ష్యం: రూ.3801.14 కోట్లు, ఇది 21.83% గా ఉందన్నారు. గత సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా సమష్టిగా పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ బ్యాంకర్ లకు సూచించారు. ఎల్ డి ఎమ్ రామచంద్ర రావు జిల్లాలో గత ఏడాది బ్యాంకర్లు సాధించిన లక్ష్యాలను గురించి వివరించారు.. సమావేశంలో కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, నాబార్డ్ డిడిఎమ్ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, మెప్మా పిడి నాగ శివ లీల, ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు...విరాళం



మన గళం,కర్నూలు వైద్యం : కర్నూలు సర్వజన వైద్యశాలకు విరాళాలందాయి. గురువారం ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు మెడికవర్ హాస్పిటల్ వారు మూడు ఏ.సి. లను విరాళంగా అందజేసినట్లు తెలిపారు. ఆసుపత్రికి విరాళం ఇచ్చిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్, డా.శివబాల నగాంజన్, మెడికవర్ హాస్పిటల్, మేనేజింగ్ డైరెక్టర్ డా.మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టలేని విద్యాశాఖ అధికారులు

**– విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న శ్రీ చైతన్య, క్రేడో స్కూలు పై చర్యలు తీసుకోవాలి.**

**– ఎస్.ఎఫ్.ఐ.నేతల డిమాండ్**




మన గళం,కర్నూలు సిటి : కర్నూలు నగరంలో ఉన్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ప్రభుత్వం నిబంధన తుంగలో తొక్కి పుస్తకాల వ్యాపారం, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర అధ్యక్షులు అబూబకర్ మాట్లాడుతూ కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాల విచ్చలవిడిగా ప్రభుత్వాన్ని ఉద్దేశించిన ఫీజుల కంటే అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పాఠశాలలో లోనే పుస్తకాల మాఫియాను చేస్తున్నారన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థలు దోపిడీని పై చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం వ్యక్తం చేసిన విద్యాశాఖ అధికారులకు పలుమార్లు తెలియజేసిన నిమ్మకు నీరెత్తినట్లు ఎటువంటి చర్యలు తీసుకోకుండా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా శ్రీ చైతన్య పాఠశాల సెల్లార్లో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతూ పాఠశాలను నడుపుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఏమాత్రం పట్టించుకోకుండా ఉల్లంఘించిన కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కూటమి ప్రభుత్వానికి, మరియు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వ అధికారులు అమ్ముడుపోయారని భావించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు ఆర్యన్, నగర సహాయ కార్యదర్శి పృథ్వి, నగర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పైకప్పు శుభ్రంగా ఉంచుకోవాలి

**– మున్సిపల్ భవనాలపై వర్షపునీరు నిలవకుండా స్పెషల్ డ్రైవ్**

**– నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు**



మన గళం,కర్నూలు నగరపాలక సంస్థ : నగర ప్రజలు తమ ఇళ్ళు, భవనాల పైకప్పులను శుభ్రంగా ఉంచుకోవాలని, పైకప్పుల్లో వర్షపునీరు నిలవకుండా సజావుగా కిందికి సాగేందుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసుకోవాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు సూచించారు. గురువారం ఆయన సచివాలయ సిబ్బందితో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పైకప్పుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల ఆ నీరు లోపలికి వెళ్ళి ఐరన్ పాడై పెచ్చులు ఊడుతాయని, స్లాబ్ పటిష్టత దెబ్బ తింటుదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అన్ని మున్సిపల్, సచివాలయ, పాఠశాల, కమ్యూనిటీ భవనాలపై శుభ్రం చేసేందుకు వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. సంబంధిత సిబ్బంది పైకప్పులను శుభ్రంగా చేసి, నీరు సజావుగా, ఆటంకం లేకుండా సాగేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలు సైతం తమ ఇంటి, భవనాల పైకప్పులు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కుండలు, ప్లాస్టిక్ బాటిల్ తదితర వాటిల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలని, తద్వారా దోమలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో వర్షపునీరు వేగంగా బయటకు వెళ్ళాలనే ఉద్దేశ్యంతో ఇప్పటికే నగర పరిధిలో ప్రధాన డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు దాదాపు పూర్తి అయ్యాయని, మిగిలిన కొన్ని ప్రాంతాల్లో వారంలోగా పూర్తి చేస్తామన్నారు..

# డ్రగ్స్ కేసులో పంజాబ్ మాజీ మంత్రి అరెస్ట్..!



మన గళం, పంజాబ్ రాష్ట్రానికి సంబంధించిన 2021 నాటి డ్రగ్స్ కేసులో శిరోమణి అకాలీదళ్ సీనియర్ నాయకుడు, ఆ రాష్ట్ర మాజీ మంత్రి విక్రమ్ సింగ్ మజీతియా అరెస్టయినట్లు తెలుస్తోంది. బుధవారం తెల్లవారుజామున విజిలెన్స్ అధికారులు అమృత్సర్లోని మజీతియా నివాసంలో ఆకస్మిక సోదాలు చేశారు. విక్రమ్ మజీతియా శిరోమణి అకాలీదళ్ పార్టీ అధ్యక్షుడు సుఖ్బీర్ సింగ్ బాదల్కు సొంత బావ. ఆయన గతంలో పంజాబ్ రాష్ట్రమంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆయన భార్య గనీవే కౌర్ మజీతియా ఎమ్మెల్యేగా ఉన్నారు. 2021 నాటి డ్రగ్స్ కేసులో విక్రమ్ మజీతియా నిందితుడిగా ఉన్నారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన సిట్.. మజీతియాకు, ఆయన కుటుంబానికి సంబంధించిన కంపెనీల్లో అక్రమ లావాదేవీలు జరిగినట్లు గుర్తించింది. ఈ క్రమంలో ఇవాళ విజిలెన్స్ బ్యూరో అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మజీతియా ఇంటిపైకి రైడింగ్కు రావడం స్థానికంగా సంచలనం రేపింది. ఈ సందర్భంగా మజీతియా, మరికొందరిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. కేసులో ఎవరినైనా అరెస్ట్ చేశారా..? అన్న ప్రశ్నకు అమృత్సర్ ఆర్పీఎస్ సంధూ అవునని చెప్పారు. అరెస్టయిన వాళ్లను ఇక్కడ నుంచి తీసుకెళ్లామని తెలిపారు. ప్రస్తుతం ఇంట్లో సోదాలు జరుగుతున్నాయని అన్నారు.

# చట్టపరమైన అవగాహన కార్యక్రమం

మన గళం,కర్నూలు రూరల్ : పెంచికలపాడులోని విశ్వ భారతి మెడికల్ కాలేజీ లో అంతర్జాతీయ మదకద్రవ్య దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ లు హాజరయ్యారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి (మాదకద్రవ్యాల దుర్వినియోగం,మాదక ద్రవ్యాల నిర్మూలన బాధితులకు న్యాయ సేవలు) పథకం, 2015 గురించి వివరించారు. అందరూ ఆలోచించి ఇతరులను ఆలోచింపచేసి మీవంతు సహాయ సహకారాలను అందిస్తూ మాదకద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించాలని, తద్వారా మనదేశ సమగ్రాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. డ్రగ్స్... మాదక ద్రవ్యాలు... ఈ మాట విననివాళ్లు లేదా ఈ పేరు తెలియనివాళ్లు అరుదు. తమాషాగా మొదలై అది లేకుంటే బ్రతకలేమనేంత బానిసలుగామార్చే శక్తి ఈ మహమ్మారి డ్రగ్స్ కు కలదని తెలిపారు. అనంతరం మెడికల్ కాలేజీ విద్యార్థులకు ర్యాగింగ్ యొక్క దుష్ప్రభావాల గురించి విద్యావ్యవస్థలలో ర్యాగింగ్ దానికి సంబంధించిన శిక్ష లు నిబంధనలు మరియు ర్యాగింగ్ కు పాల్పడిన వ్యక్తులపై భారతీయ శిక్షాస్మృతి ప్రకారం వారికి జైలు శిక్ష లేదా జరిమాన లేదా రెండు విధింపబడతాయని తెలిపారు నేరం యొక్క తీవ్రతను బట్టి శిక్ష పరిణామం మారుతుందని తెలియజేశారు. ముఖ్యంగా విద్యార్థులు ర్యాగింగ్ లో పాల్గొన్న అందుకు ప్రోత్సహించిన వారికి శిక్ష విధింపబడుతుందని దీనివల్ల విద్యార్థులకు భవిష్యత్తులో సమస్యలు ఏర్పడతాయని తెలియజేశారు. విశ్వభారతి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ వివిధ వయసులవారు, రకరకాల స్థాయిల్లో ఉన్నవారు ఈ మత్తుపదార్థాల బారినపడి అన్ని రకాలుగా పతనమౌతూ, తమ కుటుంబ సభ్యులకు మనోవేదన మిగులుస్తున్నారన్నారు. సైక్రియాటిస్ట్ డాక్టర్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ డ్రగ్స్ మాఫియాలు విద్యాసంస్థల్ని, వాటిలోని విద్యార్థుల్ని లక్ష్యంగా చేసుకొని విచ్చలవిడిగా చెలరేగిపోతున్నయన్నారు . నోడల్ ఆఫీసర్ డాక్టర్ మునీరుద్దీన్ మాట్లాడుతూ డ్రగ్ దుర్వినియోగం మరియు అక్రమ రవాణా గురించి మరియు మాదకద్రవ్యాల వాడకం వలన వచ్చే దుష్పరిణామాల గురుంచి వివరించి దాని వలన వచ్చే ప్రమాదాల గురుంచి అవగాహనా కల్పించారు. మాదకద్రవ్యాలను వాడటం వలన వారు తనను తానూ అదుపు తప్పి వారందరూ





ఆరోగ్యాన్ని చెడకోట్టుకొని జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్ ప్రజా వినియోగ సేవల కోసం ఈ శాశ్వత లోక్ అదాలత్ పనిచేస్తుందని తెలిపారు.న్యాయ సేవా సంస్థల చట్టం 1987 లో పేర్కొన్న 10 సేవలు పై అవగాహన కల్పించారు. అనంతరం ప్యారా లీగల్ వాలంటీర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసరావు ర్యాగింగ్ కు వ్యతిరేకంగా మరియు అంతర్జాతీయ మాదకద్రయ్య వ్యతిరేక దినోత్సవం పై విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వ భారతి మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు డాక్టర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ముజఫర్ నగర్ రమా ఐక్య సంఘం ఆర్ పి గా యస్ షబీరాభాను ను కొనసాగించాలి



మన గళం,కర్నూలు సిటి : ముజఫర్ నగర్ రమా ఐక్య సంఘంలో గత రెండున్నర సంవత్సరాలుగా ఆర్ పి గా పనిచేస్తున్న యస్ షబీరాభాను ను కొనసాగించాలని మెప్మా ఐబి మురళి గారిని సిపిఎం నగర కార్యదర్శి టి రాముడు సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ సాయి బాబా ఉపాధ్యక్షులు కె సుధాకరప్ప ఆర్ పి ల సంఘం జిల్లా కార్యదర్శి యస్ ఉమా దేవి నగర అధ్యక్షులు పి రుద్రమ్మ రమా ఐక్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు యస్ శారదమ్మ కె సువార్త కలిసి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా టి .రాముడు.సియచ్.సాయిబాబా మాట్లాడుతూ రమా ఐక్య సంఘం లో పొదుపు సంఘాల సభ్యులు కట్టిన డబ్బు లను తన సొంతానికి వాడు కోవడం వల్ల పాత ఆర్పీ ని తొలగించి తీర్మానం చేయడం జరిగిందని 2023 జనవరి లో రమా ఐక్య సంఘం కొత్త ఆర్పీ గా ఎస్ షబీరాబాను ను నియమిస్తూ ఐక్య సంఘం తీర్మానం చేయడం జరిగిందని అప్పటి నుండి గత రెండున్నర సంవత్సరాలుగా ఎటు వంటి జీతం లేకుండా ఆర్పీ గా పనిచేస్తుందని తెలిపారు ఐక్య సంఘం తీర్మాణం ప్రకారం ఆర్ పి గా ఆన్ లైన్ లో ఎక్కించమని ప్రాజెక్టు డైరెక్టర్ సీఎం ఎం సీఈఓ లను జిల్లా కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు కానీ రెండున్నర సంవత్సరాలుగా ఆన్లైన్ ఓపెన్ కాలేదు ఆన్లైన్ ఓపెన్ అయిన వెంటనే ఆర్పీగా ఆన్లైన్లో ఎక్కిస్తామని అధికారులు మభ్యపెడుతూ వస్తున్నారని ప్రస్తుతం ఆన్లైన్ ఓపెన్ అయిందని పాత ఆర్పి పేరు ఆన్లైన్లో వస్తుందని అవినీతి కి పాల్పడిన పాత అర్పిని ఎందుకు తొలగించకుండా ఉన్నారని వారు ప్రశ్నించారు గత రెండున్నర సంవత్సరాలుగా ఎస్ షబీరాబాను ఎటువంటి జీతం లేకుండా ఆర్పీగా పని చేస్తుందని అటువంటి ఆమెను ఆన్లైన్లో ఎక్కించకుండా అధికారుల నిర్లక్ష్యం చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు ఈ విషయాన్ని విజయవాడలో మెప్మా ప్రధాన కార్యాలయం ఎండి, డైరెక్టర్ ఆది నారాయణ గారిని కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగిందని డైరెక్టర్ ఆది నారాయణ గారు ప్రాజెక్టు డైరెక్టర్ గారికి పాత ఆర్పిని తొలగించమని ఆదేశాలు ఇచ్చిన ఇంతవరకు తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్యమని వారు తెలిపారు ఇప్పటికైనా పాత ఆర్పిని తొలగించి 2023 లో చేసిన ఐక్య సంఘం తీర్మానం ప్రకారం ఆర్పీగా షబీరాభాను ను ఆన్లైన్లో నమోదు చేయాలని లేదంటే పొదుపు మహిళలను సమీకరించి ఆందోళన చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

## మహిళా ఐక్య వేదిక కార్యవర్గ సమావేశం

మన గళం,కర్నూలు సిటి : గురువారం యస్సీ యస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక ప్రధాన కార్యాలయంలో కర్నూలు జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ అధ్యక్షతన రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్ 151 వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి మరియు రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ,పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్నం రాజేశ్వరి మాట్లాడుతూ దళిత బహుజనులకు ప్రజాస్వామిక తాత్విక పునాది మీద సామాజిక న్యాయం ఏర్పరచి ప్రజల రాజుగా నిలిచిపోయిన మహనీయులు సాహు మహారాజ్ అని ఆమె అన్నారు. మహిళా ఐక్య వేదిక కమిటీ సభ్యులు ఇలాంటి మహనీయుల ఆలోచన విధానంలో ముందుకు వెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు.అలాగే మహిళా ఐక్య వేదిక సభ్యులు నడుచు కోవలసిన పద్ధతులపై మహిళా ఐక్య వేదిక విధి విధానాలను వివరించి మహిళా ఐక్య వేదికను నిజాయితీతో నిబద్ధతతో ముందుకు తీసుకెళ్లాలని ఆమె కార్యవర్గాన్ని కోరారు. కర్నూలు జిల్లా మరియు నంద్యాల జిల్లాలోని అన్ని మండలాల్లో మహిళా ఐక్య వేదిక కమిటీ నిర్మాణాలు చేపట్టాలని, మహిళా ఐక్య వేదిక బలోపేతానికి సభ్యులు శ్రమించాలని మండల జిల్లాల కమిటీకి తెలియజేశారు. అలాగే



మహిళలు తమ ఆత్మగౌరవం, హక్కులకై నిరంతరం పోరాడాల్సిన పరిస్థితి ప్రస్తుత సమాజంలో ఉందని, మరోవైపు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, హత్యలకు, దాడులకు, వ్యతిరేకంగా మహిళలంతా ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె మహిళా ఐక్య వేదిక సభ్యులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కటికె భాను, సుంకమ్మ, ఆకుతోట పద్మావతి, ఉసేన్ బీ , ఎలీశమ్మ , ఈరమ్మ, దస్తగిరమ్మ, కొమ్ము పెద్దక్క, షేకున్ బీ, మరియమ్మ, లక్ష్మీ, రేవతి, రంగమ్మ , ఖాసిమ్ బీ, ఖాజాబీ , కళావతి, వెంకట లక్ష్మీ ,వరాలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నివాళులు

మన గళం,కర్నూలు సిటి : అఖిలభారత రైతుసంఘం స్థాపించిన స్వామి సహజానంద సరస్వతి 75వ వర్ధంతి సందర్భంగా కర్నూలు జిల్లా సీపీఐ కార్యాలయములో ఎపి రైతుసంఘముఅద్వర్యములో స్వామి సహజా నంద సరస్వతి చిత్రపటానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పూలమాలవేసి ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి దంభోళంశ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఎపి రైతుసంఘము రాష్ట్ర కార్యదర్శి పి జగన్నాథం గురువారం మాట్లాడుతూ స్వామి సహజానంద సరస్వతి జాతీయవాది, మరియు రైతు ఉద్యమ నాయకుడు. "స్వామి సహజానంద సరస్వతి" వారు అని ఆయన బీహార్లో రైతు ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రారంభించారని మరియు భూస్వామ్య వ్యవస్థను వ్యతిరేకించారని. వారు భూమిహార్ బ్రాహ్మణ సమాజంలో సంస్కరణలు తీసుకురావడానికి ప్రయత్నించారని మరియు రైతులకు న్యాయం కోసం పోరాడారని 1936 లో అఖిల భారత కిసాన్ సభను స్థాపించడంలో కూడా ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారని స్వామి సహజానంద సరస్వతి రైతుల హక్కుల కోసం చేసిన పోరాటం కారణంగా, ఆయనను "రైతుల నాయకుడు" అని కూడా పిలుస్తారన్నారు. స్వామి సహజానంద సరస్వతి గారు జాతీయవాది, మరియు దేశవ్యాప్తంగారైతు ఉద్యమానికి నాయకత్వం, భూస్వామ్య వ్యవస్థను వ్యతిరేకించడం, అఖిల భారత కిసాన్ సభ మెదటీ జాతీయ అధ్యక్షులు ఆయన అనేక రైతు సంస్కరణలు తీసుకోచ్చిన ఘనతఅయనది వారి అశయాలను కోనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో సిపిఐ సహాయ కార్యదర్శి చింతల మహేష్,ఏఐవైఎఫ్ కర్నూలు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పార్టీ నగర కార్యవర్గ సభ్యుడు బిసన్న మహిళా సమైక్య నగర కార్యదర్శి భారతి శాఖ కార్యదర్శులు రభీయ మాధవి రామాంజనేయులు గౌడ్ కృష్ణ నాయక్ మల్లికార్జున, తదితరులున్నారు .



## కర్నూలు బస్ స్టేషన్ కు 25 కుర్చీలు మంజూరు




మనగళం, కర్నూలు : నగరంలోని జిల్లా బస్ స్టేషన్ కు ఒక్కొక్క కుర్చీలో ముగ్గురు కూర్చునే వీలున్న, 25 కుర్చీలు (3-సిటర్) కేంద్ర కార్యాలయం ద్వారా మంజూరు అయ్యాయనీ వాటిని గురువారం కర్నూలు ఇంచార్జి డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు సుధారాణి ఆధ్వర్యంలో, బస్టాండులో ఉన్న సీనియర్ సిటిజెన్ లు, కర్నూలు జిల్లా సి.బెళగల్ వాస్తవ్యులు, టీచర్ అనుమన్న , అలాగే కర్నూలుకు చెందిన వ్యాపార వేత్త సుబ్బారావు చేతుల మీదుగా వాడుకలోకి తీసుకు రావడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగము (ఏపీఎస్ఆర్టీసీ),కర్నూలు జిల్లా వారు బస్టాండులో ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కర్నూలు-2 డిపో మేనేజరు శర్మ , కర్నూలు-1 అసిస్టెంట్ మేనేజరు సుబ్రహ్మణ్యం, బస్ స్టేషన్ మేనేజరు కాంచన, ఇతర ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## పోరాటాల ఫలితంగా ఎనర్జీ అసిస్టెంట్ బదిలీల గైడ్ లైన్స్ రద్దు

**- ఎం.డి. అంజిబాబు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి**

మనగళం, కర్నూలు :అసిస్టెంట్(జూనియర్ లైన్ మెన్ (గ్రేడ్- 2) బదిలీలపై ఇచ్చిన ఏపీ ఈపీడీసీఎల్ యాజమాన్యం ఇచ్చిన గైడ్ లైన్స్ తక్షణమే రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్లకు మరియు అన్ని జిల్లాల విద్యుత్ శాఖ సూపరిండెంట్ ఇంజనీర్ లకు ఎనర్జీ అసిస్టెంట్ బదిలీల గైడ్ లైన్స్ ను తక్షణమే రద్దు చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడంతో ప్రభుత్వం వెంటనే స్పందించి ఏపీ ఈపీడీసీఎల్ యాజమాన్యం ఎనర్జీ అసిస్టెంట్ (జూనియర్ లైన్ మెన్ గ్రేడ్- 2) గైడ్ లైన్స్ రద్దు చేయడం జరిగిందని కర్నూలు జిల్లా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కర్నూలు జిల్లా రీజినల్ అధ్యక్షులు, ఎం.డి. అంజిబాబు, అదేవిధంగా ఏపీ ఎస్పీడీసీఎల్ కంపెనీ కమిటీ ఉపాధ్యక్షులు, పి. నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 7529 మంది ఎనర్జీ అసిస్టెంట్స్ (జూనియర్ లైన్ మెన్ గ్రేడ్- 2) నియమించడం జరిగిందని, మీరందరూ గ్రామ సచివాలయంలో పనిచేస్తున్నారు. అయితే ఎనర్జీ అసిస్టెంట్ బదిలీలను గ్రామ సచివాలయం గైలెన్స్ ప్రకారం కాకుండా విద్యుత్ శాఖ బదిలీల నియమ నిబంధన ప్రకారమే బదిలీలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు అన్ని జిల్లాల విద్యుత్ శాఖ సూపరిండెంట్ ఇంజనీర్లకు వినతిపత్రం ఇవ్వడంతో ప్రభుత్వం స్పందించి గ్రామ సచివాలయం నిబంధన ప్రకారం బదిలీలు చేయాలని ఇచ్చిన ఉత్తరం ను రద్దు చేసిందని గుర్తు చేశారు. ఎనర్జీ అసిస్టెంట్ బదిలీలని విద్యుత్ శాఖ నిబంధన ప్రకారం బదిలీలు చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. ఏ సమస్యల పరిష్కారం కావాలంటే పోరాటాలే ఏకైక మార్గమని వారు గుర్తు




చేశారు. ఎనర్జీ అసిస్టెంట్ బదిలీల గైలెన్స్ పోరాట ఫలితముగానే రద్దయిందని కార్మికులందరూ గుర్తించాలని కోరారు.

## సప్తగిరి నగర్ ఆదిత్య నగర్ లోని మున్సిపల్ అధికారులు కాలువలు శుభ్రం చేయాలి

మనగళం, కర్నూలు :స్థానిక కర్నూలు నగరంలోని సప్తగిరి నగర్ ఆదిత్య నగర్ కాలనీలలోని సిపిఎం నగర్ కమిటీ సభ్యులు పర్యటించారు తదానంతరం ఆర్ కృష్ణ, సోల్మన్ రాజులు మాట్లాడుతూ రోడ్లు కాలువలు క్లీన్ చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని రోడ్లపై నీళ్లు చెత్తాచెదారం చేరి సప్తగిరి నగర్ ఆదిత్య నగర్ కాలనీ ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. నీళ్లు నడిరోడ్డుపై చెత్త రాళ్లు రప్పలతో రోడ్లు ఉన్నాయని, చుట్టుపక్కల ప్రజలకు ఆ నీటిలో నుంచి దోమలు దుర్వాసనతో అనారోగ్య పరిస్థితులకు గురవుతున్నారు మున్సిపల్ అధికారులు కమిషనర్ పన్నులు మాత్రం వసూలు చేస్తా ఉన్నారన్నారు. కానీ అక్కడ ఉండేటువంటి ప్రజల ఆరోగ్య పరిస్థితి పట్టించుకోకుండా రోడ్లు క్లీన్ చేయకుండా తగినంత సిబ్బందిని పెట్టకుండా వారానికి రెండు వారాలకు ఒకసారి కాలువలు తీస్తా ఉన్నారు దానివల్ల కాలువలు నిండిపోయాయని, రోడ్లపై మురుగు నీరు వచ్చి నడిరోడ్డుపై ఉండడం వల్ల నడవడం కోసం కూడా ఇబ్బంది పడతా ఉన్నారన్నారు. ప్రజలు మరో పక్క దుర్వాసనతో ఆ కాలనీ ప్రజలు దుబ్బారంగా రోజు రోజు గడపాల్సినటువంటి పరిస్థితి ఉంది అని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్లు కాలువలు శుభ్రపరచాలని మున్సిపల్ కమిషనర్ ని హేచారిస్తున్నామన్నారు. లేని 17వ వార్డు ప్రజలును సమీకరించి కమీషనర్ ఆఫీస్ నందు వచ్చి ధర్నా కార్యక్రమం చేపట్టవలసినదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు భాష, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

ప్రసూతి సెలవు.. మహిళల హక్కు

మే 23, 2025 ఇది భారతీయ స్త్రీల జీవితంలో ఒక చరిత్రాత్మక దినం. ఉద్యోగాలు చేసే మహిళల హక్కులు, ముఖ్యంగా ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీం కోర్టు ఒక అద్భుతమైన తీర్పును వెలువరించింది. కె ఉమాదేవి వెర్సెస్ ది స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో మద్రాస్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రసూతి సెలవు అనేది కేవలం ఒక విధానపరమైన అంశం కాదని, అది ఒక రాజ్యాంగ హక్కు అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు ఆర్థిక, ప్రసూతి హక్కుల పరిధిని విస్తరింపజేస్తూ, పని ప్రదేశంలో మహిళల పునరుత్పత్తి స్వేచ్ఛకు, గౌరవానికి అగ్రపీఠం వేసింది. ఈ కేసు ఉమాదేవి అనే ఉద్యోగిని చుట్టూ తిరిగింది. ఆమె తన రెండో వివాహం తర్వాత పుట్టిన మూడో బిడ్డకు ప్రసూతి సెలవు కోరారు. తమిళనాడు ప్రభుత్వం ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. అంతకు ముందు మద్రాస్ హైకోర్టు కూడా ఆమె సెలవును నిరాకరించింది. జనాభా నియంత్రణ లక్ష్యాలను ఉటంకిస్తూ మూడో బిడ్డకు ప్రసూతి సెలవును నిరాకరించే తమిళనాడు ప్రభుత్వ విధానాన్ని హైకోర్టు సమర్థించింది. అయితే సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో ఉమాదేవికి పూర్తిగా అనుకూలంగా నిలిచింది. అటువంటి వివక్షాపూరిత వ్యాఖ్యానాలను కొట్టివేసింది. పిల్లల సంఖ్య లేదా వైవాహిక పరిస్థితుల ఆధారంగా ప్రసూతి సెలవును నిరాకరించడం లేదా పరిమితం చేయడం సరికాదని కోర్టు స్పష్టం చేసింది. ప్రసూతి ప్రయోజనాలు ఒక మహిళ పునరుత్పత్తి హక్కులు, ప్రాథమిక గౌరవం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన ఆరోగ్య హక్కు లో అంతర్భాగమని కోర్టు నొక్కిచెప్పింది. అటువంటి వివక్షాపూరిత నిబంధనలు మహిళలపై 'అన్యాయమైన భారాన్ని' సృష్టిస్తాయని, వారి కెరీర్, కుటుంబం మధ్య ఎంపిక చేసుకోవలసి వస్తుందని లేదా వారి పునరుత్పత్తి నిర్ణయాలు తీసుకునే హక్కును అణగదొక్కుతాయని తీర్పు నొక్కి చెప్పింది.

ఈ తీర్పు ప్రసూతి ప్రయోజనాలను కేవలం ఒక సేవా షరతు నుండి ఒక మహిళ పునరుత్పత్తి స్వేచ్ఛ ప్రాథమిక అంశంగా మార్చింది. ఆర్టికల్ 14 (చట్టం ముందు సమానత్వం), ఆర్టికల్ 21 (జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛ రక్షణ)లతో అనుసంధానించడం ద్వారా, కోర్టు ప్రసూతి హక్కులకు పటిష్టమైన రాజ్యాంగ ఆధారాలను అందించింది. ఇప్పటి వరకు మన దేశంలో ప్రసూతి హక్కులు ప్రధానంగా ప్రసూతి ప్రయోజనాల చట్టం 1961 ద్వారా నియంత్రించబడ్డాయి. ఇది 2017లో మరింత సమగ్ర ప్రయోజనాలను అందించడానికి సవరించబడింది. ఈ చట్టం గర్భధారణ సమయంలో, తర్వాత పని చేసే మహిళలకు కొన్ని రక్షణలు, ప్రయోజనాలను అందిస్తుంది. వేతనంతో కూడిన సెలవు, తొలగింపునుండి రక్షణ, ఇతర ప్రసూతి సంబంధిత ప్రయోజనాలను అందిస్తుంది. సెలవు తర్వాత అదే లేదా సమానమైన స్థానానికి తిరిగి రావడానికి హామీ ఇస్తుంది. అయితే ఈ చట్టాలు సాధారణంగా 'రెండు కంటే తక్కువ మంది పిల్లలు ఉన్న' మహిళలకు ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేశాయి. చాలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సేవల్లో సాధారణంగా ఉన్న ఈ విధానం వివక్షాపూరితమైనదిగా, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదిగా చాలా కాలంగా వివాదాస్పదంగా ఉంది. ఈ తీర్పు భారతదేశంలో ఆర్థిక, ప్రసూతి హక్కుల దృశ్యంపై లోతైన, తక్షణ ప్రభావాలను చూపుతుంది. ఇద్దరు పిల్లల నిబంధన లేదా ఇలాంటి ఆంక్షల ద్వారా గతంలో పరిమితం చేయబడిన ప్రభుత్వ ఉద్యోగులపై దీని ప్రభావం ప్రత్యక్షంగా ఉంటుంది. ఈ తీర్పు ఇప్పుడు వారికి పిల్లల సంఖ్యలేదా వైవాహిక సందర్భంతో సంబంధం లేకుండా ప్రసూతి ప్రయోజనాలను పొందేందుకు అనుమతిస్తుంది, వారి జీవితంలో ఒక కీలక సమయంలో కీలక ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. ఈ నిర్దిష్ట కేసు ప్రభుత్వ ఉద్యోగికి సంబంధించినది అయినప్పటికీ సుప్రీంకోర్టు స్పష్టం చేసిన బలమైన రాజ్యాంగ సూత్రాలు ప్రైవేట్ రంగంతో సహా ఇతర రంగాలలో ఇలాంటి వివక్షాపూరిత పద్ధతులను సవాలు చేయడంలో గణనీయంగా ఉపయోగపడతాయి.

పిల్లల సంఖ్య ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేయడానికి ప్రయత్నిస్తున్న ఏ సంస్థ అయినా ఇప్పుడు చట్టపరమైన సవాలును ఎదుర్కోవలసి ఉంటుంది. కుటుంబ పరిమాణం ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను నిరాకరించడం తరచుగా మహిళలను, ముఖ్యంగా పునర్వివాహం చేసుకున్న లేదా వివిధ కారణాల వల్ల ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉన్న వారిని అసమానంగా ప్రభావితం చేస్తుంది. అసంఘటిత రంగాలలో పనిచేసే మహిళలకు ఆర్థిక ప్రసూతి హక్కులను విస్తరించడం అనే విస్తృత సమస్య ఇంకా మిగిలి ఉంది. ఈ మహిళలకు తరచుగా వేతనంతో కూడిన ప్రసూతి సెలవు, వైద్య బోనస్, లేదా శిశు సంరక్షణ సౌకర్యాలు వంటి చట్టబద్ధమైన ప్రయోజనాలు అందుబాటులో ఉండవు. గర్భధారణ సమయంలో వారి దుర్బలత్వం తరచుగా వారిని అకాలంగా పనికి తిరిగి వెళ్ళడానికి లేదా మరింత పేదరికంలోకి నెట్టివేస్తుంది. ఈ ప్రగతిశీల తీర్పు స్ఫూర్తిని ఉపయోగించుకొని మరింత సమ్మిళితమైన, సార్వత్రిక సామాజిక భద్రతా చట్టాలను రూపొందించడం తదుపరి కీలక అడుగు. తద్వారా అసంఘటిత రంగానికి కూడా ఆర్థిక ప్రసూతి సహాయాన్ని అందించడం ఈ మే 23, 2025 తీర్పు మహిళల హక్కులను పునరుద్ఘాటిస్తుంది. మాతృత్వం ఉద్యోగానికి అడ్డంకి కాకూడదని లేదా ఆర్థిక ఇబ్బందులకు కారణం కాకూడదని వాదిస్తుంది. ఇది ఆశకు ఒక దీపస్తంభంగా పనిచేస్తుంది. ప్రసూతి ప్రయోజనాల రక్షక గొడుగును విస్తరిస్తుంది. ప్రతి తల్లి ఆమె ఉద్యోగ రంగంతో సంబంధం లేకుండా, గౌరవంగా, ఆర్థిక భద్రతతో మాతృత్వాన్ని స్వీకరించగలదని నిర్ధారిస్తుంది. ఈ తీర్పు రాజ్యాంగపరమైన ప్రేరణను అందిస్తుంది. ఇప్పుడు, సమగ్ర ఆర్థిక ప్రసూతి హక్కులను దేశంలోని ప్రతి మహిళకు వాస్తవంగా మార్చడానికి శాసన, విధానపరమైన విభాగాలు చర్యలు తీసుకోవాలి.

## ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్ ఏర్పాటు కై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపండి

మన గళం,తుగ్గలి : కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ భాష ను గురువారం కర్నూలు కలెక్టరేట్ లో మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామలింగయ్య పల్లె గ్రామము లో ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్ ఏర్పాటు కై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ను ఆయన కోరారు. ఇప్పటికే ఈ విషయం శాసనసభ్యులు శ్యాం కుమార్ దృష్టి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో బీసీ విద్యార్థులు ఎక్కువ గా ఉన్నారని, అందువల్ల ప్రభుత్వ బాలుర హాస్టల్ ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. అందుకు అవసరమైన స్థలాన్ని కూడా తాము సమ కూర్చామని తెలిపారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి ప్రతి పాదనలో పంపుతామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.




## దివ్యాంగులకు ఇళ్ల వద్దే రేషన్ పంపిణీ




మన గళం, పత్తికొండ : ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వృద్ధులు, దివ్యాంగులకు ఐదు రోజుల ముందే ఇళ్ల దగ్గరకు తీసుకెళ్లి రేషన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినదని , అందు బాగంగా జిల్లా జాయింట్ కలెక్టరు బి.నవ్య పత్తికొండ పట్టణం నందు దివ్యాంగురాలు అయిన శాంత బాయి ఇంటికి వెళ్ళి జులైలో ఇవ్వాల్సిన రేషన్ ను పంపిణీ చేశారు. రేషన్ సంస్కరణల్లో భాగంగా ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీలోపు వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్ద రేషన్ అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## కారు బైక్ ఢీ వ్యక్తి మృతి..




మన గళం అవుకు : నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం అవుకు పట్టణంలో గురువారం కారు బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది .వివరాలకు వెళ్తే నంద్యాల జిల్లా గోస్పాడు మండలం తేళ్లపూరి గ్రామానికి చెందిన కాటంరెడ్డి నాగేంద్ర రెడ్డి (61) అవుకు సబ్ రిజిస్టర్ ఆఫీస్ నందు వ్యక్తిగత పని పూర్తి చేసుకొని అవుకు నుండి తేల్లపురికి వెళ్తుండగా మెట్టుపల్లె మెట్ట సమీపాన బనగానపల్లె నుండి అవుకు వస్తున్న కారు ఢీకొట్టడంతో నాగేంద్ర రెడ్డి అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అవుకు ప్రభుత్వ వైద్యశాల కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.




## డోన్ సబ్ రిజిస్టార్ కార్యాలయాన్ని తరలించకూడదు

- భద్రత సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.
- పెద్ద వంకను అనుకోని నిర్మించిన భవనమును లోకి మార్చాలనుకోవడం స్వార్ధ పూరిత ఆలోచనే
- కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల కు లబ్ది చేకూర్చాడానికి ఆఫీస్ ను మార్చాలని అనుకోవడం సరైన పద్ధతి కాదు
- డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి, డిసిసి ఉపాధ్యక్షులు న్యాయవాది ఉన్నిగొర్ల జనార్ధన్

మన గళండోన్ పట్టణ నడిబొడ్డున ఉండే డోన్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ ను డోన్ పట్టణం వెలుపలకు తరలిస్తున్నారని,డోన్ సబ్ రిజిస్టార్ ఆఫీస్ ను బయటకు తరలిస్తే అనేక రకాల భద్రతా సమస్యలు ఏర్పడతాయని, కనుక బయటకు తరలించకూడదని, డోన్ మరియు డోన్ గ్రామీణ ప్రాంత ప్రజల కోసం డోన్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ ను బయటకు తరలించకుండా చర్యలు తీసుకోవాలని, ఈ నూతన కార్యాలయం పెద్ద వంకను ఆనుకొని భవనాన్ని నిర్మించడం జరిగింది, రాబోయే కాలములో వరదలు వచ్చి ఆఫీస్ మునిగి పోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ ఆలోచన కేవలం కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ది చేకూర్చాడానికి తీసుకున్న నిర్ణయమని డోన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి న్యాయవాది డాక్టర్ గార్లపాటి మద్దులేటీ స్వామి, డిసిసి ఉపాధ్యక్షులు న్యాయవాది ఉన్నిగొర్ల జనార్ధన్ మరియు డాక్యుమెంట్ రైటర్స్ ఆధ్వర్యంలో స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియచేసి ఎస్ ఆర్ ఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం స్థానిక డోన్ ఆర్ డి ఓ కార్యాలయం ముందు ధర్నా చేసి వారికి కూడా ఒక వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ ఆఫీస్ నందు ప్రజలు రకరకాల పనులైన భూములు, ఇంటి స్థలాలు, భవనాలు,మొదలైన స్థిర, చరాస్థులు కొనుగోలు, అమ్మకాలు గానీ, తనఖా, గాని,ధానవిక్రయాలు గాని,ఇలా అనేక రకరకాల రిజిస్టేషన్ చేయించు కోవడం జరుగుతుంది, ఈ క్రమములో కొనుగోలుదారులు, అమ్మకం దారులు మధ్య పెద్ద మొత్తములో డబ్బు లు చేతులు మారుతుఉంటాయి. ఈ సబ్ రిజిస్టర్ ఆఫీస్ ను పట్టణానికి దూరంగా ఏర్పాటు చేస్తే భద్రత సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. అదే ఆఫీస్ పట్టణం నడిబొడ్డున ఉన్న ప్రదేశములో ఉంటే ఎటువంటి భద్రత సమస్యలు వచ్చే అవకాశం లేదు. అంతే కాకుండా పక్కనే పోలీస్ స్టేషన్, కోర్టు,ఎమ్మార్వో ఆఫీస్,అన్ని రకాల ఆఫీసులో ఉండడంవల్ల ఏ రకమైనటువంటి పని ఉన్న అతి తక్కువ సమయంలో పనులు జరిగే అవకాశం ఉంది.మరియు ఉంది. కూతబెట్టి దూరంలో బస్టాండు, రైల్వే స్టేషన్ రవాణ సదుపాయాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అంతే కాకుండా సబ్ రిజిస్టర్ ఆఫీసు మీదా ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక మంది డాక్యుమెంట్ రైటర్లు గాని, కంప్యూటర్ షాప్ లు జిరాక్స్ సెంటర్ లు పెట్టుకొని టైపిస్టులు చాలామంది తక్కువ అద్దెతో షాపులను తీసుకొని ఉపాధి పొందుతున్నారు, గత ప్రభుత్వహయములో ట్రాఫిక్ సమస్యల పేరుతో అక్కడున్నటువంటి షాప్ లను ఇంకో పక్కకి మార్చడం జరిగింది, తద్వారా చాలామంది లక్ష ల రూపాయలు ఖర్చులు పెట్టుకొని బంకులను, (షాప్) ఏర్పాట్లు చేసుకున్నారు, మరి ఇప్పుడు పట్టణం వెలుపలకు మార్చితే లక్షల రూపాయలు వృధా అవ్వడమే కాక వారి జీవనోపాధి కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది కనుక డోన్ సబ్ రిజిస్టార్ ఆఫీస్ ప్రస్తుతం ఎక్కడైతే ఉందో అదే ప్రాంతములో యదా స్థితిని కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నది.లేని పక్షములో అన్ని రాజకీయ పార్టీ లను, ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమం చే పడతాం అని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం క్రమములో కాంగ్రెస్ పార్టీ డోన్ పట్టణ అధ్యక్షులు వై శేఖర్ యాదవ్, ప్యాపిలి మండల అధ్యక్షులు ఎస్ మహేంద్ర నాయుడు, నంద్యాల డిసిసి ప్రధాన కార్యదర్శి వడ్డే రాజశేఖర్, డిసిసి కార్యదర్శి మధు సుధన్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు హనుమాన్, సీనియర్ న్యాయ వాది డాక్యుమెంట్ రైటర్స్ గుండాల శ్యాంసుందర్, ఆర్.సుదర్శనరావు, ఆర్.గోపినాథరావ్, వెంకటరమణ, రంగయ్య, శ్రీరామచంద్రుడు, ఎ.నాగరాజు, ఎ.వెంకటేష్, పోలు లక్ష్మిరెడ్డి, నారాయణ, ఏ.వెంకటస్వామి, గోల్ల మల్లికార్జున, శ్రీకాలువ ఆదినారయణ, మోహన్, చందు, భారతి, రమేష్ బాలరాజు, అబ్దుల్, ఇష్మాయిల్, వెంకటేష్, నరసింహుడు, చిరంజీవి, నాగరాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





## డ్వాక్రా సంఘాల రిసోర్స్ పర్సన్స్ కు ట్యాబ్ పంపిణీ చేసిన కోట్ల





మన గళండోన్ పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో డోన్ మున్సిపల్ పరిధిలోని మెప్మా డ్వాక్రా సంఘాల రిసోర్స్ పర్సన్స్ కు సామ్సంగ్ గెలాక్సీ ఏ9 ప్లస్ టాబ్స్ ను ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డోన్ మున్సిపల్ పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు సేవలు వేగంగా అందాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం డిజిటల్ విదానాన్ని తెచ్చింది మున్సిపాల్టీల వారీగా మహిళా సంఘాల వివరాలను ఆన్లైన్లో పొందుపరిచేందుకు స్లమ్ సమాఖ్య రిసోర్స్ పర్సన్లకు ఈ టాబ్స్ ఉపయోగపడతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ గారు, మెప్మ అధికారులు, రిసోర్స్ పర్సన్స్‌లు పాల్గొన్నారు.

## శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు

మనగళం శ్రీశైలం : ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 1.02 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. జలాశయం నీటిమట్టం గురువారం ఉదయం 6 గంటల సమయానికి 861.70 అడుగులు.. నీటి నిల్వ 111.40టీఎంసీలుగా నమోదైంది.



## బనగానపల్లె వాసవి పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పాలిసెట్ కౌన్సిలింగ్ సెంటర్ కు విశేష స్పందన..






మన గళం బనగానపల్లె : దివంగత మాజీ గవర్నర్, డిప్యూటీ హోమ్ మినిస్టర్ పెండేకంటి వెంకటసుబ్బయ్య స్థాపించిన వాసవి పాలిటెక్నిక్ కళాశాల నందు పాలిసెట్ కౌన్సిలింగ్ సెంటర్ ను గురువారం నాడు కళాశాల సిబ్బంది ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థిని,విద్యార్థుల తల్లితండ్రులు మాట్లాడుతూ పాలిసెట్ కౌన్సిలింగ్ కొరకు దూర ప్రాంతాలకు వెళ్లి ఎన్నో అవస్థలు పడుతున్న నేపథ్యంలో స్థానికంగా బనగానపల్లె పట్టణంలోని వాసవి పాలిటెక్నిక్ కళాశాల నందు ఏర్పాటు చేయడం తమకు ఎంతో ఆనందంగా ఉందని అలాగే ఇక్కడ కౌన్సిలింగ్ కు వచ్చిన తర్వాత ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి కౌన్సిలింగ్ ప్రక్రియను అతి వేగవంతంగా చేస్తున్నారని స్థానిక విద్యార్థినీ విద్యార్థులు మరియు తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేసారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చేసుకోవాలని కోరుకుంటున్నాము.అలాగే ఈ అవకాశాన్ని అందజేసిన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి మరియు కళాశాల యాజమాన్యానికి,సిబ్బందికి విద్యార్థిని,విద్యార్థుల తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణంకోసం దేవస్థానం ఈ రోజు (26.06.2025) ఆలయప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద నెలకొని ఉన్న శ్రీ దత్తాత్రేయస్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. ఈ పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. లోకోద్ధరణకోసమై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకే స్వరూపములో దత్తాత్రేయునిగా అవతరించారు. అందుకే త్రిమూర్తి స్వరూపునిగా దత్తాత్రేయుడు ప్రసిద్ధుడు. కాగా శ్రీశైలక్షేత్రానికి దత్తాత్రేయుల వారికి ఎంతో దగ్గర సంబంధం ఉంది. ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద దత్తాత్రేయులవారు తపస్సు చేశారని ప్రతీతి. అందుకే ఈ వృక్షానికి దత్తాత్రేయ వృక్షమని పేరు. కాగా దత్తాత్రేయస్వామివారు కలియుగంలో గోదావరితీరాన పిఠాపురంలో శ్రీపాదవల్లభునిగా జన్మించారు. వీరు ఒకసారి శ్రీశైలక్షేత్రంలోనే చాతుర్మాస్య వ్రతాన్ని ఆచరించినట్లుగా గురుచరిత్రలో చెప్పబడింది. కాగా శ్రీపాదవల్లభుడు తమ శిష్యులకు ఆయా తీర్థక్షేత్రాల మహిమావిశేషాలను పేర్కొనే సందర్భంలో కూడా శ్రీశైలాన్ని పలుసార్లు ప్రస్తావించారు. శ్రీపాదవల్లభుల జన్మ తరువాత మహారాష్ట్రలోని కరంజినగరములో నృసింహసరస్వతి స్వామిగా దత్తాత్రేయస్వామివారు జన్మించారు. వీరు ఒకసారి మహాశివరాత్రి రోజున శ్రీశైలమల్లికార్జునుని సేవించినట్లుగా కూడా గురుచరిత్ర చెబుతోంది. నృసింహసరస్వతి వారు తమ అవతార సమాప్తిని శ్రీశైలంలోని పాతాళగంగలోనే చేశారు. కలియుగ ప్రభావం రోజు రోజుకు ఎక్కువకావడముతో, నృసింహసరస్వతీస్వామి అదృశ్య రూపములో ఉండి తన భక్తులను రక్షించాలని నిర్ణయించారు. దాంతో భౌతికదేహాన్ని త్యజించేందుకు నలుగురు శిష్యులతో కలిసి శ్రీశైలానికి వచ్చారు. శ్రీశైలంలోని కదళీవనం దగ్గర తమ శిష్యులు చూస్తుండగానే నృసింహసరస్వతిస్వామివారు అరటి ఆకులతో చేసిన ఒక ఆసనంపై కూర్చొని, కృష్ణానదిలో ప్రవేశించి, కొంతదూరం ఆ అరటిఆకులపైనే పయనిస్తూ, అదృశ్యమైనట్లు గురుచరిత్ర చెబుతోంది.

## కొణిదెల గ్రామంలో రూ. 50 లక్షల తో 90 వేల లీటర్ల త్రాగునీటి ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన

**- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి సొంత నిధులతో గ్రామంలో త్రాగునీటి ట్యాంకు నిర్మాణం**

**- నిర్మాణం పనులను నాణ్యతతో నాలుగు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మన గళం,నందికొట్కూరు/నంద్యాల : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నేతృత్వంలో... ప్రజల యొక్క అవసరాలు, ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా పథకాలను అమలుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. గురువారం నందికొట్కూరు మండలం కొణిదెల గ్రామంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి సొంత నిధులు రూ.50 లక్షలతో 90వేల లీటర్ల త్రాగునీటి ట్యాంక్ నిర్మాణానికి సంబంధించి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎంపీ శబరి, నందికొట్కూరు రైల్వే కోడూరు ఎమ్మెల్యేలు జయ సూర్య, అరవ శ్రీధర్, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొని భూమిపూజ మరియు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.. గ్రామానికి అవసరమైన 90 వేల లీటర్ల తాగునీటి ట్యాంకుకు భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమానికి మీ అందరితో కలిసి పాల్గొనడం చాలా సంతోషం. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి మరియు ఉపముఖ్యమంత్రిలు చక్కటి ప్రణాళికలతో గ్రామస్థాయి వరకు పథకాలను అమలు చేసేలా అనునిత్యం పర్యవేక్షిస్తున్నారు. గత ఏడాది కాలంగా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను మన జిల్లాలో చేసుకున్నాం. ప్రజల యొక్క జీవన ప్రమాణాలు పెరగాలి, ఉపాధి పెరగాలి, ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని, గ్రామాలు ఎప్పుడూ కళకళలాడుతూ ఉండాలని ప్రభుత్వం కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మనము వస్తువులను సమకూర్చుకోవడం ఒక ఎత్తు అయితే, సొంత నిధులతో గ్రామ అవసరాలకు, ప్రజల అవసరాలకు ఇవ్వాలంటే చాలా పెద్ద గొప్ప మనసు ఉండాలి. ఉపముఖ్యమంత్రి వర్యులు తన ఇంటి పేరు ఉన్న గ్రామానికి పెద్ద మనసుతో స్వయంగా తన పేషీ నుంచి ఈ గ్రామంలో 90 వేల లీటర్ల తాగు ట్యాంక్ నిర్మించడానికి సొంత నిధులు కలెక్టర్ గారికి పంపడం జరిగింది. ఈ కార్యక్రమానికి పరిపాలనపరమైన అనుమతులు ఇచ్చాం, టెండర్స్ పిలిచి ఫైనలైజ్ చేసి ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్ ద్వారా పనిని ప్రారంభించడం జరిగింది. పనిని చాలా నాణ్యతగా చేయాలి, ఇది ఒక మోడల్ గా అందరికీ చూపించాలనీ ఉప ముఖ్యమంత్రి వర్యులు సూచించారని కలెక్టర్ తెలిపారు. నాలుగు నెలల్లో పని పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీకి సూచించామన్నారు. పని పూర్తయి ప్రారంభోత్సవ సమయంలో ఉపముఖ్యమంత్రి వర్యుల చేతుల మీదుగా గ్రామస్తులకు అందించే విధంగా కార్యక్రమానికి ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. మన జిల్లాలో గత ఏడాది 489 గ్రామాల్లో ఒకేసారి గ్రామ సభలు చేసుకుని రూ..85 కోట్ల ఉపాధి హామీ నిధుల అనుసంధానంతో సీసీ రోడ్లు, బిటి రోడ్లు, డబ్ల్యూబిఎం రోడ్లు పూర్తి చేసుకున్నాం. ఈ సంవత్సరం కూడా సుమారు 100 కోట్ల రూపాయలతో రహదారి కనెక్టివిటీ లేని గ్రామాలకు ప్రాధాన్యత ఇస్తూ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు వెళుతున్నాం. రూ.10 కోట్ల ఖర్చుతో ఎక్కడెక్కడ గుంతలు ఉన్నాయో వాటిని కూడా పూడ్చడం జరిగింది. మనం అమరావతికి కనెక్ట్ కావడానికి చాలా చక్కటి 340 సి జాతీయ రహదారి ఎంతో ఉపయోగకరమైనది. ఎక్కడా లేని విధంగా జిల్లాలో దాదాపు 9 జాతీయ రహదారులు ఉన్నాయి. ఇందులో పాతవి నాలుగు, కొత్తగా ఐదు జాతీయ రహదారులు వస్తున్నాయి. గృహ నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఎస్సీ, బీసీలకు 50 వేల రూపాయలు, ఎస్టీలకు 75 వేల రూపాయలు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సహాయం అందిస్తోంది. గృహ నిర్మాణాలు ఇంకను పూర్తి చేసుకొని లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీ శబరి మాట్లాడుతూ... గత ఐదు ఏళ్లలో మన ఊరు, మన నియోజకవర్గం ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా ఉందో మీ అందరికీ తెలుసు. కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలోనే గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఎప్పుడో ఎన్నికల ముందు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు కొణిదల గ్రామానికి వచ్చి ఇక్కడి చెట్టు కింద కూర్చొని గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. తన మాట ప్రకారం సొంత నిధులు రూ.50 లక్షలు గ్రామానికి ఇచ్చారు. రాజకీయాలలో ప్రజా సమస్యలపై స్పందించే ఇలాంటి నాయకులు కావాలి. ప్రజాసేవ చేసే నాయకులు మనకు ఎంతో ముఖ్యం. ఉప ముఖ్యమంత్రి గారు పంపిన నిధులను గ్రామానికి అవసరమైన విధంగా సరైన పనిని కలెక్టర్ గారు మంజూరు చేసినందుకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఇంకను గ్రామానికి అవసరమైన పనులను ప్రణాళిక మేరకు పూర్తి చేసుకునేలా ముందుకు వెళ్తున్నామని ఎంపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య మాట్లాడుతూ... అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా గతంలో గ్రామానికి విచ్చేసిన సందర్భాన్ని గుర్తు చేయడం జరిగింది. ఇందుకు స్పందించిన ఉపముఖ్యమంత్రి గ్రామ మౌలిక వసతులకు నిధులు మంజూరు చేయాలని తన అధికారులను ఆదేశించారు. అలాగే ఆనాడు తాను ఇచ్చిన మాట మేరకు గ్రామంలో 90 వేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి ట్యాంక్ నిర్మాణానికి రూ.50 లక్షల నిధులను వెంటనే జిల్లా కలెక్టర్ గారికి అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ఇందుకు గ్రామ ప్రజలందరి తరపున ఉపముఖ్యమంత్రి వర్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. గ్రామంలో ఉన్న భూగర్భ డ్రైనేజీ సమస్యతో పాటు ఇతర సమస్యలపై కూడా ప్రాధాన్యత పరంగా పూర్తి చేసుకునేలా ముందుకు వెళుతున్నాం. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలను అందరికీ అందజేయడం జరుగుతుంది. ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం డబ్బులు ఇవ్వడం కూడా జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ... కొణిదల గ్రామంలో ఉపముఖ్యమంత్రి గారి సొంత నిధులతో చేపట్టిన 90 వేల లీటర్ల త్రాగునీటి ట్యాంక్ భూమి పూజ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఏదైనా మాట ఇస్తే ఉప ముఖ్యమంత్రి దాన్ని నిలబెట్టుకుంటారు. కేవలం డబ్బులు ఇవ్వడమే కాదు ఆ పనిని నాణ్యతగా పూర్తి చేసేంతవరకు పర్యవేక్షణ చేస్తారు. గ్రామీణాభివృద్ధిలో గతంలో ఎవ్వరు చేయని విధంగా గ్రామాల అభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పాటుపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఈ కొణిదల గ్రామానికి వచ్చి.. తన ఇంటిపేరు ఉన్న గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించడానికి సొంత నిధులు రూ.50 లక్షలు ఇవ్వడం ఆయనకు ఉన్న గొప్ప మనసుకు ఉదాహరణ. సాయం చేయడంలో ఆయనకు ఎంతో ఆనందం ఉంది అలాంటివారు చాలా అరుదుగా ఉంటారని, ప్రజా సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కరించేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నవీన్, జిల్లా, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయప్రాంగణములోని వీరభద్రస్వామికి విశేష పూజలు

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (25.06.2025) సాయంకాలం ఆలయ ప్రాంగణం లోని వీర భద్ర స్వామి వారికి (జ్వాలావీరభద్ర స్వామి వారికి) విశేషపూజలను నిర్వహిస్తోంది. ఆలయ ప్రాంగణం లో మల్లి కార్జున స్వామి వారి ఆలయాని కి ఉత్తరభాగం లో మల్లికా గుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్ర స్వామి జ్వాలామకుటం తో పదిచేతుల తో విశిష్టరూపం లో దర్శనమిస్తాడు. స్వామివారికి ప్రక్కనే దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామిని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం జరుగుతోంది. కాగా ప్రతి బుధవారం ప్రదోషకాలంలో విశేష అభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ పూజవలన లోకశాంతి, దుర్భిక్షనివారణ, భక్తుల అనుకున్న కోరికలు నెరవేరుతాయి. ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది. కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహా గణపతి పూజను నిర్వహించబడు తుంది. తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలురకాల ఫలోదకాలతోనూ, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం నిర్వహించడం జరుగుతుంది. ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామి వారికి పుష్పార్చనను జరిపించ బడుతుంది.



## మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తుల జీవితాలను నాశనం చేస్తుంది



**- జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు**

మన గళం,కల్లూరు : కల్లూరు మండలం, ఉల్లిండకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్. రఘు అవగాహన కార్యక్రమం నిర్వహించినారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తాత్కాలిక ఆనందం కోసం సరదాగా ప్రారంభమయ్యే మాదక ద్రవ్యాల వినియోగం క్రమంగా వ్యక్తులను బానిసలుగా మారి జీవితాన్ని నాశనం చేస్తుందని, మత్తు పదార్థాలు తీసుకున్న వారి మెదడులో డోపమైన్,సెరటోనీన్ అనే ఉత్ప్రేరకాలు విడుదల అవుతాయని,తద్వారా శరీరం ఉత్తేజంగా ఉన్నట్లు అనిపించిన కాసేపటికి మళ్ళీ మళ్ళీ తీసుకోవాలనిపిస్తుందని క్రమంగా మానసిక,ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని,మెదడుపై తీవ్రమైన ప్రభావం చూపి శ్రద్ధ,ఏకాగ్రత,జ్ఞాపకశక్తిని దెబ్బతీయడమే కాకుండా చురుకుదనాన్ని తగ్గిస్తుందని, మత్తు పదార్థాలు సేవించిన తరువాత వ్యక్తుల్లో భ్రమలు మొదలై నేరప్రవృత్తి పెరగడంతో పాటు ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వస్తుంటాయని దీంతో తమను తాము గాయపరచుకోవడమే కాకుండా దాడులు,హత్యలు,దొంగతనలు వంటి నేరాలకు ఒడిగట్టే ప్రమాదము ఉందని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం ప్రజల శాంతి జీవితలపై ,సామాజిక శాంతి,అభివృద్ధి,పెరుగుదలపై ప్రభావము చూపిస్తుందని .మానసిక ,శారీరక అనారోగ్యాలు తలెత్తుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలొ వైద్యులు డాక్టర్. నవీన్ కుమార్, హెడ్ మాస్టర్ లీలావతి, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, హైమావతి, ఆరోగ్య విస్తరణ అధికారి విజయకుమార్, క్షేత్ర స్థాయి పర్యవేక్షకులు మద్దమ్మ, ఆరోగ్య కార్యకర్త పద్మావతి మరియు ప్రాజెక్షనీస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

## వేగం, నాణ్యత, నిష్పక్షపాతంగా ప్రజల సమస్యలను పరిష్కరించాలి

**- రెవిన్యూ రికార్డులను పటిష్టంగా నిర్వహించాలి**

**- జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్**



మన గళం,పగిద్యాల : మండలంలో ప్రజల సమస్యలను వేగం, నాణ్యత, నిష్పక్షపాతంగా సత్వరం పరిష్కరించేలా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ మండల అధికారులను ఆదేశించారు. గురువారం పగిద్యాల మండల తాసిల్దార్ కార్యాలయాన్ని జేసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డు రూము, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. తాసిల్దార్ మరియు సిబ్బంది రోజువారి కార్యక్రమాల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలను అందించాలన్నారు. పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం, రీ సర్వే అంశాలపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. ప్రజల సమస్యల పట్ల ఎలాంటి అశ్రద్ధ వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని జేసి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దారు, డీటీలు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా.. పలువురికి గాయాలు

మనగళం శ్రీశైలం కర్నూలు: శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి దోమలపెంట వద్ద ఉదయం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. శ్రీశైలం మల్లన్న దర్శనార్థం బయలుదేరి దోమలపెంట వద్దకు రాగానే బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు తెలిపారు. ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పలువురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: అటవీ శాఖ

మనగళం శ్రీశైలం : సున్నిపెంట, లింగాలగట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ శ్రీశైలం రేంజర్ సుభాశ్ హెచ్చరించారు. సున్నిపెంటలో చిరుత పులి ఓ ఇంట్లోకి ప్రవేశించిన ఘటనను ఎఫ్ఎస్ఓ మదన్ కుమార్ నేతృత్వంలో సిబ్బంది పరిశీలించారు. శివారు ప్రాంతాల వారు జాగ్రత్తగా ఉండాలని, చిరుత సంచారం ఉంటే వెంటనే అటవీ శాఖకు తెలియజేయాలని సూచించారు. స్థానిక ప్రాంతాల్లో నిరంతర గస్తీ కొనసాగుతోందని తెలిపారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# యువత భారత రాజ్యాంగం పై అవగాహన కలిగి ఉండాలి

మన గళం, నందికోట్కూరు : జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్కూరు కార్యాలయం ఆధ్వర్యంలో నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంవిధాన్ హత్య దివస్ ను పాటించారు. సెట్కూరు సిఇఓ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ (అత్యవసర పరిస్థితి) 1975 జూన్ 25 నుండి అమలులోకి వచ్చి 1977 మార్చి 21న 1977 మార్చి 21 వరకు, అంటే 21 నెలల పాటు కొనసాగిందని తెలిపారు. అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి 50 ఏళ్లు పూర్తైన నేపథ్యంలో దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన జూన్ 25న సంవిధాన్ హత్య దివస్ గా జరుపుకోవాలని కేంద్రం ప్రభుత్వం గెజిట్ను విడుదల చేసినదని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అత్యవసర పరిస్థితి సమయంలో ఎన్నో బాధలు అనుభవించిన వారిని స్మరించుకునే ఉద్దేశంతో, రాజ్యాంగ దుర్వినియోగానికి వ్యతిరేకంగా పోరాడిన వారందరికీ నివాళులు అర్పించేందుకు మరియు ప్రజలకు భారత రాజ్యాంగ విశిష్టత తెలియపరిచే అవగాహనా కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు మరియు అన్నివర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఎమెర్జెన్సీ వంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రజలందరూ ముఖ్యంగా యువత రాజ్యాంగము పట్ల అవహగాహన పెంచుకొని రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకోవాలని కోరారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సోమ శివా రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఇప్పటికి మూడు సార్లు ఎమర్జెన్సీ విధించినప్పటికీ రెండు సార్లు యుద్ధాల కారణంగా విధిస్తే 1975 జూన్ 25 వ తేదీన విధించిన ఎమర్జెన్సీ చరిత్ర పుటలలో నిలిచిపోయిందని అన్నారు. ఎమర్జెన్సీ కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ స్మరించుకునేందుకు ఈ సంవిధాన్ హత్య దివస్ పాటిస్తారని తెలిపారు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ రఘు రామాచార్యులు గారు మాట్లాడుతూ ఎమర్జెన్సీ సమయంలో పత్రికలను సెన్సార్ చేశారని, దాదాపు 100,000 మందికి పైగా ఎమర్జెన్సీ కి వ్యతిరేకంగా పోరాడిన వారు జర్నలిస్టులు, మరియు అసమ్మతివాదులు జైలు పాలయ్యారని, కేంద్ర ప్రభుత్వం ప్రజలలో చైతన్యం తేవడం కోసం సంవత్సర కాలం పాటు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని ఇందులో అన్ని వర్గాల ప్రజలు, యువత భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు పర్యవేక్షకులు శ్రీ శ్యాం బాబు, కళాశాల అధ్యాపకులు సురేష్ బాబు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

- సెట్కూరు సీఈఓ డా!! కె.వేణుగోపాల్




# విశేషపూజలు

మనగళం శ్రీశైలం : ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ రోజు (26.06.2025) స్వర్ణరథారూఢులైన శ్రీ స్వామి అమ్మవార్లకు విశేష పూజా దికాలు నిర్వహించ బడ్డాయి. ఆరుద్రోత్సవం లో భాగంగా ఈ రోజు వేకువజామున ముందుగా శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. కాగా వర్షం కారణంగా స్వర్ణరథోత్సవం నిలుపుదల చేయబడింది. ఈ పూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా కార్యక్రమములో కోలాటం, డోలు వాయిద్యం మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ పూజాదికాలలో ఆలయ అధికారులు, అర్చకస్వాములు తదితర సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.





# నేను నా జీవితంలో చేసిన అతిపెద్ద రిస్క్ అదే : ముకేశ్ అంబానీ

మన గళం, రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ తాను తన జీవితంలో చేసిన అతిపెద్ద రిస్క్ గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. 2016లో రిలయన్స్ జియోతో టెలికాం రంగంలోకి తిరిగి అడుగుపెట్టడాన్ని ఆయన తన జీవితంలోనే 'అతిపెద్ద రిస్క్' గా ఆయన అభివర్ణించారు. ఆర్థికంగా విఫలమవుతుందని విశ్లేషకులు అంచనా వేసినప్పటికీ.. భారతదేశాన్ని డిజిటల్‌గా మార్చడంలో జియో పోషించిన పాత్రను తాను మరిచిపోలేనని మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ కంపెనీ మెకిన్సీ అండ్ కోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అంబానీ వెల్లడించారు. ఉచిత వాయిస్ కాల్స్, అతి తక్కువ ధరలో డేటా అందించడం ద్వారా 2016లో భారత టెలికాం మార్కెట్‌లో రిలయన్స్ జియో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. దాంతో పోటీ సంస్థలు సైతం ధరలు తగ్గించాల్సి వచ్చింది. మొబైల్ ఇంటర్నెట్ అందరికీ అందుబాటులోకి వచ్చింది. అయితే తాను జియో 4జీ సేవలను ప్రారంభించాలని అనుకున్నప్పుడు చాలామంది అనలిస్టులు అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి భారత్ సిద్ధంగా లేదని చెప్పారని అంబానీ గుర్తుచేశారు. ఆ సందర్భంలో తన బోర్డు సభ్యులతో ఒక్కటే చెప్పానని అన్నారు. 'మనం ఎక్కువ రాబడి ఆర్జించకపోవచ్చు. అదేమంత పెద్ద సమస్య కాదు. ఇది మన సొంత డబ్బు. ఒక సంస్థగా రిలయన్స్ భారత దేశానికి అందించిన అత్యుత్తమ సేవ అవుతుంది. డిజిటల్ భారతంగా మార్చబోతున్నాం' అని చెప్పానని అన్నారు. రిలయన్స్ ప్రస్తుతం 47 కోట్ల మంది యూజర్లతో దేశంలోనే అతిపెద్ద టెలికాం ఆపరేటర్‌గా ఉంది. 'ఈ భూమ్మీదకు వచ్చేటప్పుడు ఏం లేకుండా వస్తాం. వెళ్లేటప్పుడు ఏం తీసుకెళ్లం. మీరు వదిలిపెట్టేది ఒక సంస్థను మాత్రమే' అని తన తండ్రి ధీరూభాయ్ అంబానీ ఓ సందర్భంలో తనతో చెప్పిన విషయాన్ని ముకేశ్ అంబానీ గుర్తుచేశారు. 2027లో రిలయన్స్ గోల్డెన్ జూబ్లీ జరుపుకోబోతోందని, వందేళ్లు పూర్తయినా కూడా రిలయన్స్ భారతదేశానికి, మానవాళికి సేవ చేయాలని తాను కోరుకుంటున్నట్లు అంబానీ తెలిపారు. 1960, 70ల్లో రిలయన్స్, 2000, 2020ల్లో రిలయన్స్‌ను చూస్తే ఈ విషయం అర్థమవుతుందని చెప్పారు. సంస్థ ఎప్పటికప్పుడు రూపాంతరం చెందుతోందన్నారు. టెక్నాలజీ అవకాశాలను అందిపుచ్చుకున్నప్పుడు మరిన్ని కొత్త అవకాశాలు వస్తాయని, వాటిని విడిచిపెట్టాలనుకోవడం లేదని ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రిస్క్ మేనేజ్‌మెంట్ గురించి ముకేశ్ అంబానీ మాట్లాడారు. ఏదైనా ప్రారంభించేటప్పుడు అత్యంత ప్రతికూల సందర్భం ఏం ఎదురుకావొచ్చో ముందే ఆలోచించాలని, ఆ స్థితిని ఎదుర్కోవడానికి ముందే సిద్ధం కావాలని, తాను నమ్మే రిస్క్ మేనేజ్‌మెంట్ సూత్రాల్లో ఇది ఒకటని ముకేశ్ అంబానీ చెప్పారు.





# అందరూ పిస్తా తినవచ్చా?



మన గళం, ఆరోగ్యం బాగుండాలి అంటే మంచి పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలి. లేదంటే అనారోగ్య సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది. డ్రై ఫ్రూట్స్ వల్ల విటమిన్లు అందుతాయి.కానీ అందులో కొన్ని తినడం వల్ల మాత్రం కొందరికి మేలు జరగదు అంటున్నారు నిపుణులు. ఇక పిస్తా గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. మరి ఈ పిస్తాను ఎవరు తినాలి? ఎవరు తినకూడదు అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. పిస్తా పప్పులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పొటాషియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, కాపర్, యాంటీ ఆక్సిడెంట్లు, ప్రోటీన్లు, విటమిన్ బీ6, ఫైబర్, కాల్షియం, ఐరన్ వంటివి ఎక్కువగా ఉంటాయి. వీటిని తింటే శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తుంది. దీంతో అలసట, బలహీనతకు చెక్ చెప్పవచ్చు. ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ కొందరు పిస్తా పప్పు తినకూడదని వైద్యులు చెబుతున్నారు. ఇంతకీ ఎవరు తినకూడదు అంటే.. ఇటీవల కిడ్నీ సమస్యల కేసులు పెరుగుతున్నాయి. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడటం అనేది సర్వసాధారణమైంది. ఇలాంటి వారు కూడా పిస్తా పప్పులు తినకూడదు. ఎందుకంటే వీటిలో ఆక్సలేట్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది మూత్రపిండాల్లో రాళ్ల సమస్యను మరింత పెంచుతుంది. దీన్ని తినడం వల్ల కిడ్నీల్లో రాల్లు రావడం లేదా కిడ్నీల పని తీరు దెబ్బతినడం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ప్రస్తుత టెక్ యుగంలో దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు పెరిగింది అనేది కాదనలేని వాస్తవం. పేలవ జీవనశైలి కారణంగా చాలామంది అధిక బరువుతో బాధపడుతున్నారు. ఈ సమస్య నుంచి బయట పడటానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. అయితే బరువు తగ్గాలనుకునే వారు పిస్తా పప్పులు తినకూడదు. ఎందుకంటే వీటిలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. ఇవి బరువును మరింత పెంచుతాయి. కొందరు రెగ్యూలర్ గా మందులు వాడుతుంటారు. అలాంటి వారు కూడా ఈ పిస్తాను తినకపోవడమే బెటర్. ఎందుకంటే ఇవి మందులతో చర్య జరిపి శరీరంపై దుష్ప్రభావాలు కలిగిస్తాయి. పిస్తాలను తినాలనుకుంటే ముందు జాగ్రత్తగా డాక్టర్‌ను సంప్రదించడం బెటర్. చాలా మందికి తినే ఆహారంపై సరైన అవగాహన ఉండటం లేదు. జంక్, స్పైసీ, ఫ్రైడ్, ప్యాక్డ్ ఫుడ్స్ అతిగా తింటున్నారు. దీంతో పొట్ట ఆరోగ్యం దెబ్బతిని జీర్ణ సమస్యలు తలెత్తున్నాయి. అయితే జీర్ణ సమస్యలతో బాధపడేవారు పిస్తా పప్పులు తినకూడదు. ఎందుకంటే ఇవి శరీరంలో వేడిని ఉత్పత్తి చేస్తాయి. ఫలితంగా అజీర్ణం, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యల రిస్క్ పెరుగుతుంది. నట్స్, సీడ్స్ కొందరికి పడవు. వీటిని తినడం వల్ల అలర్జీ సమస్యలు వస్తాయి, జీర్ణం అవడం కూడా చాలా ఇబ్బందిగా మారుతుంది. ఈ పిస్తా శరీరానికి వేడిని కలిగిస్తూ దురద వంటి చర్మ సమస్యలకు కారణం అవుతుంది కాబట్టి కాస్త జీర్ణ సమస్యలు ఉన్న వారు దూరంగా ఉండటం బెటర్.. ఒకవేళ తినాలనుకుంటే ముందుగా వైద్యుడిని సంప్రదించడం మంచిది అని గుర్తు పెట్టుకోండి. పిల్లలు కూడా వీటికి దూరంగా ఉండటం బెటర్. కొందరు సరిగ్గా నమలకుండానే తింటారు. దీంతో మింగేటప్పుడు పిస్తా లేదా దాని ముక్క గొంతులో ఇరుక్కుపోతే చాలా ఇబ్బంది అవుతుంది. అంతేకాదు ఊపిరి తీసుకోవడం కష్టంగా ఉంటుంది. అందుకే చిన్న పిల్లలకు పిస్తాలు ఇవ్వకపోవడం మంచిది.

# అధిక బరువుతో బాధపడుతున్నారా?

మన గళం, అధిక బరువు ఉండటం ఎప్పుడు సమస్యనే. ఇలా బరువు ఉండటం ఎవరికి నచ్చదు కూడా. అందుకే బరువు తగ్గేందుకు చాలా మంది రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. ఇది పైకి తేలికగా కనిపించినప్పటికీ, చాలామందికి ఇది సాహసంలా కనిపిస్తుంది. కొందరు జిమ్, యోగా, డైట్, వర్కవుట్ వంటివి చేస్తూ సన్నగా మారడానికి ప్రయత్నిస్తుంటారు. మరికొందరు డైట్ పాటిస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా సరే ఓ రెండు కిలోలు మాత్రమే తగ్గుతారు. మరి మీ బరువు తగ్గాలి అంటే ఏం చేయాలో ఓ సారి చూడండి. ఊబకాయం ఉంటే మధుమేహం, అధిక రక్తపోటు , కొలెస్ట్రాల్ వంటి సమస్యలను మరింత పెంచుతాయి. కాబట్టి ఊబకాయంతో బాధపడేవారు వీలైనంత త్వరగా బరువు తగ్గడం మంచిది. అందుకే బరువు తగ్గడానికి ఆపిల్ సైడర్ వెనిగర్ ను తీసుకోవచ్చు. మరి దీన్ని ఎలా ఉపయోగించాలి? అనే వివరాలు తెలుసుకోవాలంటే ఈస్టోరీ ఫాలో అవండి. బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నప్పుడు మనం సైడ్ ఎఫెక్ట్స్ కు గురికాకుండా ఉండటం కూడా చాలా ముఖ్యం. కాబట్టి సహజ మార్గాల ద్వారా బరువు తగ్గడమే చాలా మంచిది అని గుర్తు పెట్టుకోండి. బరువు తగ్గడానికి మొదటి అడుగు తక్కువ కేలరీల ఆహారం తీసుకోవడం. కొన్ని శక్తివంతమైన పానీయాలు తాగడం వల్ల మీరు తేలికగా బరువు తగ్గవచ్చు. అటువంటి పానీయమే ఆపిల్ సైడర్ వెనిగర్. గోరువెచ్చని నీటిలో కలిపి తాగడం వల్ల వేగంగా బరువు తగ్గుతారు. ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో 2 క్యాప్ఫుల్స్ యాపిల్ సైడర్ వెనిగర్ బాగా కలిపి తీసుకోవాలి. భోజనానికి 15 నిమిషాల ముందు కూడా దీన్ని తీసుకోవచ్చు. ఎందుకంటే ఇది ఆహారం బాగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. కాబట్టి ఈ డ్రింక్‌ను తరచుగా తీసుకోకూడదని గుర్తుంచుకోండి. బరువు తగ్గడానికి ఆపిల్ సైడర్ వెనిగర్ వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో కూడా తెలుసుకుందాం. బరువు తగ్గాలనుకునే వారు రోజూ యాపిల్ సైడర్ వెనిగర్ తాగడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఈ విధంగా మీరు కేలరీలను తగ్గించవచ్చు, కొవ్వును కరిగించవచ్చు మరియు వేగంగా బరువు తగ్గవచ్చు. ఈ అద్భుతమైన పానీయం అనేక విధాలుగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇది అప్పుడప్పుడు ఆకలి బాధలను అరికడుతుంది. అనవసరమైన అనారోగ్యకరమైన ఆహారాన్ని నిరోధిస్తుంది. దీన్ని తాగడం వల్ల అదనపు కేలరీలు తీసుకోకుండా ఉంటాం.



# ప్రాసెస్ట్ ఫుడ్ తరచూ తింటున్నారా?

మనలో చాలా మంది ప్రాసెస్ట్ ఫుడ్ ను ఎక్కువగా తింటుంటారు. స్నాక్స్, చిప్స్, మ్యాగీ వంటి పదార్థాలు ఇష్టంగా లాగించేస్తుంటారు. అంతేకాదు చల్లగా ఉన్నాయంటూ కూల్ డ్రింక్స్ ను కూడా ఎక్కువగా తాగేస్తుంటారు.అయితే ఈ విధంగా తినడం, తాగడంతో ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్లే.. అదేంటి? అనుకుంటున్నారా? నిజమేనండి. ప్రాసెస్డ్ ఫుడ్ తినేవారి జీవిత కాలం తగ్గుతుందంట.ప్రస్తుత బిజీ కాలంలో ఏది అందుబాటులో ఉంటే దాన్నే తినేస్తున్నారు. టైం సరిగా లేకపోవడంతో టిఫిన్ మొదలుకుని భోజం వరకు చాలా వరకు ప్రాసెస్డ్ ఆహారం మీదే ఆధారపడి జీవిస్తున్నారని చెప్పుకోవచ్చు. ఈ క్రమంలోనే ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్, వివిధ రకాల స్నాక్స్ ఇలా అందుబాటులో ఉన్న వాటితో సరిపెట్టుకుంటున్నారు. పట్టణాల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. ప్రాసెస్డ్ ఫుడ్ ను తీసుకోవడం వలన జీవిత కాలం తగ్గడంతో పాటు అకాల మరణం కూడా సంభవించే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఉప్పు, చక్కెర మరియు కొవ్వు అధికంగా ఉండే ఈ ఫుడ్ ను తరచూ తినడం వలన శరీరానికి తగిన పోషకాలు అందవని తాజా అధ్యయనాలలో వెల్లడైందని తెలియజేస్తున్నారు. ఈ కారణంగానే బీపీ, మధుమేహంతో పాటు గుండె సంబంధిత వ్యాధులు మరియు క్యాన్సర్ వంటి అనారోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. అంతేకాదు చిప్స్, బిస్కెట్ల వంటి అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారం తినడం వలన శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని.. ఇది చివరికి ప్రాణాపాయానికి దారి తీస్తుందని నిపుణులు తెలిపారు. దాంతోపాటుగా గుండె జబ్బులు, మూత్ర పిండాల వ్యాధి వంటి పలు సమస్యల బారిన పడే ఛాన్స్ ఉంది. అదేవిధంగా మెటబాలిక్ సిండ్రోమ్, స్థూలకాయం, ముసలితనం వంటి అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అధ్యయనాల్లో వెల్లడైంది. అందుకే రోజువారీ ఆహారంలో పది శాతం కన్నా ఎక్కువగా ఇటువంటి ఫుడ్ ను తీసుకోరాదని హెచ్చరిస్తున్నారు.



# రాత్రిళ్లు పాదాలు చల్లగా మారుతున్నాయా?

మన గళం, రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరిగితే, గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కానీ కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగితే ఆ విషయాన్ని ముందుగానే పసిగట్టడం ఎలా? ఏయే లక్షణాలు కన్పిస్తాయి? వంటి విషయాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ముఖ్యంగా పాదాలలో చెడు కొలెస్ట్రాల్ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగినట్లయితే పాదాలలోని ఈ కింది లక్షణాల ద్వారా చెప్పవచ్చు.రక్తంలో అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగితే ప్రారంభ లక్షణం.. కొంచెం నడిచినా లేదా కొంచెం ఎక్కువ పని చేసినా శ్వాస ఆడకపోవడం. అయితే, శ్వాస ఆడకపోవడానికి అనేక ఇతర కారణాలు ఉండవచ్చు. అందువల్ల, రక్త పరీక్ష లేకుండా కొలెస్ట్రాల్ పెరిగిందనే నిర్ధరణకు రాకూడదు.రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయి పెరిగితే పాదాలలో చాలా సమస్యలు వస్తాయి. వీటి ద్వారా కొలెస్ట్రాల్ స్థాయి పెరిగిందో లేదో సులభంగా అర్థం చేసుకోవచ్చు. రక్తంలో కొలెస్ట్రాల్ పెరిగితే రాత్రిపూట పాదాలు చల్లగా మారుతాయి.



# యాక్టింగ్ చేస్తూనే డాక్టర్ చదువు

మన గళం, షార్ట్‌టైమ్‌లోనే స్టార్‌డమ్‌ను అందుకున్న నటి శ్రీలీల. గుంటూరు కారం సినిమాతో మాస్ ఫాలోయింగ్ తెచ్చుకున్న ఈ బ్యూటీ ప్రయాణం చాలా ప్రత్యేకమైంది. తండ్రి తనను స్వీకరించకపోవడం నుంచి ఇద్దరు దివ్యాంగ పిల్లలను దత్తత తీసుకోవడం వరకూ ఆమె జీవితం ఆశ్చర్యకర ఘటనలతో నిండిపోయింది. డాక్టర్ కావడమే కాకుండా, ఇప్పుడు ఆమె టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకూ భారీ అవకాశాలతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదుగుతోంది. అలా మొదలైన సినీ ప్రయాణం 2019లో కన్నడ చిత్రం కిస్ ద్వారా హీరోయిన్‌గా శ్రీలీల రంగప్రవేశం చేశారు. ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర హిట్ కావడంతో ఆమెకు టాలీవుడ్ అవకాశాలు వచ్చాయి. రామ్‌తో స్కంద, బాలకృష్ణతో భగవంథ్ కేసరి, రవితేజతో ధమాకా సినిమాలు ఆమెను మాస్ ఆడియెన్స్‌కు దగ్గర చేశాయి. ఇప్పుడు ఆమె శివకార్తికేయన్‌తో పారాశక్తి అనే పాన్ ఇండియా మూవీ చేస్తోంది. కెరీర్ టర్నింగ్ పాయింట్ : 2024లో మోస్ట్ హైప్ కలిగిన సినిమాల్లో ఒకటైన గుంటూరు కారంలో మహేష్ బాబుతో జతకట్టిన శ్రీలీలకు ఇది కెరీర్ టర్నింగ్ ప్రాజెక్ట్ అయింది. ఈ సినిమాలో ఆమె పాత్రకు పెద్దగా స్పేస్ లేకపోయినా, డ్యాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో అభిమానులను ఆకట్టుకుంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం కమర్షియల్‌గా క్లాస్. మాస్ ఆడియెన్స్‌కు కనెక్ట్ అవ్వడంతో, శ్రీలీల మార్కెట్ మరింత పెరిగింది. పుష్ప 2 – "కిసిక్" సాంగ్ తో నేషనల్ క్రేజ్ : అల్లు అర్జున్ నటించిన పుష్ప 2లో "కిస్సిక్" అనే స్పెషల్ సాంగ్‌కు శ్రీలీల చేసిన డాన్స్, గ్లామర్ ప్రెజెంటేషన్ ఆమెకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. ఈ సాంగ్ చూసి ఆమెకు బాలీవుడ్ ఆఫర్స్ వచ్చాయి. ఇక సోషల్ మీడియాలో ఈ పాట మిలియన్ల వ్యూస్‌తో ట్రెండ్ అవుతోంది బాలీవుడ్ ఎంట్రీ– కార్తిక్ ఆర్యన్‌తో రొమాంటిక్ డ్రామా : శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్‌లో కూడా అడుగుపెట్టబోతున్నారు. ఆమె తొలి హిందీ చిత్రం అనురాగ్ బసు దర్శకత్వంలో, కార్తిక్ ఆర్యన్ సరసన రూపొందనుంది. టైటిల్ ఇంకా నిర్ణయించకపోయినా ఇది ఓ డీప్ లవ్ స్టోరీగా ఉండబోతుందట. శ్రీలీలకి ఇది మరో లెవల్ టర్నింగ్ పాయింట్ అని చెప్పవచ్చు. ఈ సినిమా క్లిక్కయితే అమ్మడు బాలీవుడ్?లో కూడా మరింత బిజీగా మారే అవకాశం ఉంది. డాక్టర్‌గా కెరీర్ – సామాజిక సేవా సంకల్పం : ఆడిషన్స్ షూటింగ్స్‌కి మధ్య చదువుని కూడా ఎప్పుడూ నిర్లక్ష్యం చేయని శ్రీలీల, 2021లో హైదరాబాద్?లోని అపోలో మెడికల్ కాలేజ్ నుంచి ఎంబీబీఎస్ డిగ్రీ పొందింది. ఆమె తల్లి స్వర్ణలత ప్రసిద్ధ గైనకాలజిస్ట్ కావడంతో, అమె ప్రేరణతో వైద్యవృత్తిలోకి అడుగుపెట్టింది. సినిమాలు చేస్తూనే



అవసరమైనప్పుడు మెడికల్ కాంప్‌లలో సేవలందిస్తుండటం గొప్ప విషయం. ఇద్దరు దివ్యాంగ పిల్లల దత్తత : 2022 ఫిబ్రవరిలో శ్రీలీల ఓ అనాథ ఆశ్రమాన్ని సందర్శించినప్పుడు, గురు, శోభిత అనే ఇద్దరు చిన్నారులను చూసి కీలక నిర్ణయం తీసుకుంది. వెంటనే వారిని దత్తత తీసుకుని జీవితాంతం వారికి సహాయపడాలని నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని స్వయంగా మీడియాకు వెల్లడించిన శ్రీలీలపై అప్పట్లో దేశవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తాయి.

# 'బిచ్చగాడు 3' విడుదల ఎప్పుడో చెప్పిన విజయ్ ఆంటోనీ




మన గళం, తమిళ నటుడు విజయ్ ఆంటోనీ ప్రధానపాత్రలో తెరకెక్కిన చిత్రం 'మార్గన్' . క్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ సినిమాకు లియో జాన్ పాల్ దర్శకత్వం వహిస్తుండగా.. విజయ్ ఆంటోనీ ఫిలింస్ కార్పొరేషన్ బ్యానర్‌పై మీరా విజయ్ ఆంటోనీ నిర్మిస్తుంది. ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాను తెలుగులో సురేష్ ప్రొడక్షన్ విడుదల చేయబోతుంది. ఈ సందర్భంగా తెలుగు మీడియాతో ముచ్చాటించాడు విజయ్. మంచి కంటెంట్ ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడు ఆదరిస్తారని విజయ్ తెలిపాడు. బిచ్చగాడు సినిమా హిట్ అయినట్లుగానే మార్గన్ సినిమా కూడా తెలుగులో మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందన్నారు విజయ్. అయితే ఈ మీట్‌లో మీడియా అడుగుతూ.. మీ దర్శకత్వంలో సినిమా ఎప్పుడు వస్తుందని అడుగగా.. విజయ్ సమాధానమిస్తూ.. ప్రస్తుతం నేను బిచ్చగాడు 3 సినిమాను తెరకెక్కిస్తున్నాను. 2027లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఫస్ట్ రెండు పార్టుల కంటే భిన్నంగా ఈ సినిమా ఉండబోతుందని విజయ్ చెప్పుకోచ్చాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఒక సైకో స్విమ్మర్ అమ్మాయిలకు ఒక వింత డ్రగ్‌ను ఇచ్చి హత్య చేస్తుంటాడు. ఈ డ్రగ్ ప్రభావం వల్ల వారి భాదితుల శరీరాలు నల్లగా మారి ప్రాణాలు కోల్పోతాయి. అయితే ఈ కేసును దర్యాప్తు చేసే పోలీస్ అధికారి పాత్రలో విజయ్ ఆంటోనీ కనిపించనున్నారు. దర్యాప్తులో భాగంగా అతను కూడా ఈ డ్రగ్ బారిన పడి, అతని శరీరంలో సగం నల్లగా మారడం ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. ఈ హత్యల వెనుక ఉన్న అసలు కారణం ఏమిటి, హంతకుడిని విజయ్ ఆంటోనీ ఎలా పట్టుకుంటాడనేది సినిమా ప్రధాన కథాంశం. ఈ సినిమాలో విజయ్ ఆంటోనీ మేనల్లుడు అజయ్ దిశాన్ విలన్‌గా నటించబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

# అజయ్ దేవ్‌గణ్ 'సన్ ఆఫ్ సర్దార్ 2' గ్లింప్స్ విడుదల




మన గళం, బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం సన్ ఆఫ్ సర్దార్ . విజయ్ కుమార్ అరోరా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మృణాల్ థాకుర్ కథానాయికగా నటించబోతుంది. దిగ్గజ దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో సునీల్ హీరోగా వచ్చిన మర్యాద రామన్న సినిమాను హిందీలో సన్ ఆఫ్ సర్దార్ అని రీమేక్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే సినిమాకు సన్ ఆఫ్ సర్దార్ 2 అంటూ సీక్వెల్‌ను తీసుకువస్తున్నారు మేకర్స్. ఇప్పటికే ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా విడుదల తేదీతో పాటు టీజర్‌ను పంచుకుంది. ఈ సినిమాను జూలై 25న విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

# ఫైనల్‌కు అభయ్, అన్వాత్ జోడీ



మన గళం, ఫైనల్‌కు అభయ్, అన్వాత్ జోడీ ఏషియన్ స్క్వాష్ డబుల్స్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు ఫైనల్‌కు దూసుకెళ్లారు. మలేషియాలోని కుచిం గ్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో టాప్ సీడ్ అన్వాత్ సింగ్–అభయ్ సింగ్ ద్వయం.. మి క్స్‌డ్ డబుల్స్‌లో ఫైనల్ చేరారు. ఏషియన్ స్క్వాష్ డబుల్స్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు ఫైనల్‌కు దూసుకెళ్లారు. మలేషియాలోని కుచిం గ్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో టాప్ సీడ్ అన్వాత్ సింగ్–అభయ్ సింగ్ ద్వయం.. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఫైనల్ చేరారు. సెమీస్‌లో ఈ జోడీ.. 2–1 (11–8, 10–11, 11–5)తో మలేషియా ద్వయం అమని–కమల్‌ను చిత్తుచేసింది. మహిళల డబుల్స్‌లో అన్వాత్–చిన్న ప్ప.. 2–0 (11–7, 11–6)తో సెమీస్‌లో హాంకాంగ్‌కు చెందిన క్రిస్టి వొంగ్–టొబి సియిను ఓడించింది. పురుషుల డబుల్స్‌లో అభయ్–సెంథిల్ కుమార్.. ఫైనల్ చేరారు.

# క్రికెట్ టీమ్‌ను కొన్న సల్మాన్ ఖాన్




మన గళం, క్రికెట్ టీమ్‌ను కొన్న సల్మాన్ ఖాన్ బాలీవుడ్ అగ్రనటుడు సల్మాన్ ఖాన్ క్రికెట్ టీమ్‌కు ఓనర్ అయ్యాడు. గత రెండు సీజన్లుగా దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులను అలరిస్తున్న ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ (ఐఎస్‌పీఎల్)లో సల్లూ భాయ్.. ఢిల్లీ ఫ్రాంచైజీని దక్కించుకున్నాడు. బాలీవుడ్ అగ్రనటుడు సల్మాన్ ఖాన్ క్రికెట్ టీమ్‌కు ఓనర్ అయ్యాడు. గత రెండు సీజన్లుగా దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులను అలరిస్తున్న ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ (ఐఎస్‌పీఎల్)లో సల్లూ భాయ్.. ఢిల్లీ ఫ్రాంచైజీని దక్కించుకున్నాడు. టెన్నిస్ బాల్‌తో ఆడే ఈ టోర్నీలో ఇదివరకే అమితాబ్ బచ్చన్ (ముంబై), సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్ (కోల్‌కతా), అక్షయ్ కుమార్ (శ్రీనగర్), హృతిక్ రోషన్ (బెంగళూరు), రామ్‌చరణ్ (హైదరాబాద్), సూర్య (చెన్నై) వంటి సెలబ్రిటీలు ఫ్రాంచైజీలను కలిగిఉండగా తాజాగా ఈ జాబితాలో సల్మాన్ చేరాడు. సల్మాన్ ఈ టోర్నీలో భాగస్వామి అయ్యాడని ఐఎస్‌పీఎల్ కమిషనర్ సూరజ్ సమత్ ధృవీకరించాడు. త్వరలోనే అహ్మదబాద్ ఫ్రాంచైజీ ఓనర్ వివరాలు వెల్లడిస్తామని ఆయన అన్నారు.

# కార్ల్‌సన్‌కు ఝులక్ ఇచ్చిన 9 ఏండ్ల బాలుడు

మన గళం, భారత్‌కు చెందిన తొమ్మిదేండ్ల పిల్లాడు ఆరిత్ కపిల్.. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్‌పై గెలిచినంత పనిచేశాడు. ఓ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ వేదికగా జరిగిన 'ఎర్లీ టైటిల్డ్ ట్యూస్‌డే' టోర్నీలో భాగంగా కార్ల్‌సన్‌తో తలపడ్డ ఆరిత్.. తనదైన ఎత్తులతో చెస్ దిగ్గజానికి చెమటలు పట్టించాడు. ఆఖరి వరకూ గేమ్‌ను సొంతం చేసుకునే రేసులో ఉన్న ఆరిత్.. చివర్లో తనకు లభించిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంలో తడబడటంతో గేమ్ డ్రాగా ముగిసింది. ఇదిలాఉండగా టోర్నీలో భారత్‌కే చెందిన వి. ప్రణవ్.. 10 పాయింట్లతో అగ్రస్థానాన నిలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు.






# త్వరలో టీపీబీఎల్



మన గళం, త్వరలో మరో లీగ్ క్రీడాభిమానులను అలరించబోతున్నది. తెలంగాణ ప్రొ బాస్కెట్‌బాల్ లీగ్(టీపీబీఎల్) అన్ని హంగులతో రాబోతున్నది. ఆరు జట్ల కలయికతో వచ్చే నెల 3 నుంచి 6వ తేదీ వరకు టీపీబీఎల్ ప్రి సీజన్ జరుగనుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 500 మందికి పైగా ప్లేయర్లు పోటీపడే అవకాశమున్న లీగ్‌కు సంబంధించిన వివరాలను అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లీగ్ వివరాలను ప్రకటించారు. లీగ్‌లో ఆరు జట్లు హైదరాబాద్ హ్యాక్స్, రంగారెడ్డి రైనోస్, వరంగల్ వారియర్స్, కరీంనగర్ కింగ్స్, నిజామాబాద్ నవాబ్స్, మహబూబ్‌నగర్ బుల్స్ పోటీపడనున్నట్లు టీబీఏ అధ్యక్షుడు రావుల శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిభ కల్గిన ప్లేయర్లను వెలుగులోకి తీసుకొచ్చేందుకు టీపీబీఎల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

# భారత్, ఇంగ్లాడ్ టెస్ట్‌ల మధ్య జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి.. నిజమేనా..

మన గళం, భారత జట్టు ఇంగ్లాండ్ పర్యటనలో 0–1 తేడాతో వెనుకబడి ఉన్నప్పటికీ, ఇంకా సిరీస్ గెలిచే అవకాశం ఉంది. ఈ క్రమంలో జస్ప్రీత్ బుమ్రాకు పలు టెస్టుల్లో విశ్రాంతి ఇవ్వాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అయితే నిజంగా మార్పులు చేస్తారా లేదా అనేది చూద్దాం. భారత క్రికెట్ జట్టు ఇంగ్లాండ్ పర్యటనకు బయలుదేరినప్పుడు, గెలుస్తుందని అందరికీ చాలా ఆశలు ఉన్నాయి. మొదటి మ్యాచులో పలువురు ఆటగాళ్లు సెంచరీలు సాధించగా, జస్ప్రీత్ బుమ్రా సత్తా చాటి ఐదు వికెట్లు తీసినా కూడా లీడ్స్‌లో జరిగిన మ్యాచ్ భారత్ ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో అద్భుతమైన వ్యక్తిగత ప్రదర్శనలు ఉన్నప్పటికీ, జట్టు తుది ఫలితాన్ని మార్చుకోలేకపోయింది. ప్రస్తుతం భారత జట్టు 0–1 తేడాతో వెనుకబడి ఉంది. ఇంగ్లాండ్‌తో ఆడిన తొలి టెస్ట్‌లో ఓటమి పాలైంది. ఈ సందర్భంగా బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడం అనే అంశం వెలుగులోకి వచ్చింది.

భారీస్థాయిలో ఓపెనింగ్

దీనిపై రవిచంద్రన్ అశ్విన్ స్పందించి బుమ్రాకు విశ్రాంతి ఇవ్వడం కంటే, అతను రెండో టెస్ట్ ఆడాలని, 1–1 తేడాతో సిరీస్‌ను సమం చేయడానికి ప్రయత్నించాలని అభిప్రాయపడ్డారు. భారత బౌలింగ్ యూనిట్‌లో జస్ప్రీత్ బుమ్రా పేస్ అటాక్‌ను ఆధిపత్యం చూపించినప్పటికీ, ఇంగ్లాండ్ పర్యటనలో అతనికి పెద్దగా సపోర్ట్ లభించలేదు. లీడ్స్ మ్యాచ్‌లో, బుమ్రా రెండు ఇన్నింగ్స్‌లలో దాదాపు 45 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఇది భారత బౌలర్ల మధ్య రెండో అత్యధిక ఓవర్ల మ్యాచ్ అని చెప్పవచ్చు. దీంతో అతనికి రెస్ట్ అవసరం అని చెబుతున్నారు. ఒకవేళ బుమ్రాకు విశ్రాంతి ఇచ్చి, అతను కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి అవకాశం ఇవ్వాలనుకుంటే, అతని శారీరక దశలను మెరుగుపరచడానికి దోహదం చేస్తుంది. ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో ఆడిన తర్వాత, అతను తన శక్తిని పూర్తిగా వినియోగించి, జట్టు విజయం కోసం పోరాడాడు. ఈ నేపథ్యంలో అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ఈ విషయంపై చర్చించారు. మొదట, ఇంత మంచి టెస్ట్ ఆడిన తర్వాత, జట్టులో పలు మార్పులు చేయడం ఇష్టపడనని పేర్కొన్నాడు. మేము 1–0 తేడాతో వెనుకబడి ఉన్నామని పరిగణనలోకి తీసుకుంటే, జస్ప్రీత్ బుమ్రాకు రెండో టెస్ట్ ఆడమని, సిరీస్‌ను సమం చేయాలని సూచిస్తానని చెప్పాడు. ఆ తర్వాత అతను విశ్రాంతి తీసుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశాడు. అశ్విన్ ఇచ్చిన ఈ ఆలోచన, జట్టులో మార్పులు చేసే బదులు క్రమబద్ధమైన విధానం పాటించాలని సూచిస్తుంది. భారత జట్టుకు సుదీర్ఘ పర్యటనలో ఆటగాళ్లపై ఒత్తిడి వంటివి పరిగణలోకి తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. ఇంగ్లాండ్ టూర్‌లో, శార్దూల్ ఠాకూర్ బ్యాటింగ్ లో తన ప్రతిభను చూపించాడు. చివరి రోజు, మ్యాచ్ సమీపిస్తున్న సమయంలో, అతను రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. అతని ప్రతిభ పట్ల చాలామంది క్రికెట్ దిగ్గజాలు ప్రశంసలు కురిపించారు. దీంతోపాటు నితీష్ రెడ్డిపై కూడా ఆశలు ఉన్నాయి. ఆస్ట్రేలియా బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో నితీష్ రెడ్డి అద్భుతమైన ప్రదర్శన చేశాడు. అతను ఐపీఎల్లో కూడా మంచి ఫామ్‌లో ఉన్నాడు. అయితే, నితీష్ రెడ్డిని టాప్ 6 బ్యాటర్‌గా ఇంగ్లాండ్ పర్యటనలో ఉపయోగించాలా లేదా అని జట్టు ఆలోచిస్తోంది.




Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310